ప్రజా చైతన్యమే...
# లక్ష్యం
తెలుగు దినపత్రిక
email : lakshyam2013@gmail.com
ఎడిటర్ ఇన్ చీఫ్ - మధుసూదనరావు చల్లా
R.N.I. No. APTEL/2013/48712
Simultaneously circulated in Amaravathi, Hyderabad, Vijayawada, Nellore, Ongole, Guntur, Krishna, Chittoor, Kadapa & all Districts of Andhra Pradesh & Telangana.
ఎడిటర్ ఇన్ చీఫ్ - మధుసూదనరావు చల్లా
Cell : 6302222748, 9492569010
సంపుటి : 12 సంచిక : 107 గుంటూరు గురువారం 22 మే 2025 పేజీలు : 8 వెల : 5.00

LEGAL AFFAIRS
All legal Affairs About Lakshyam Telugu Daily, Should be filled in Guntur Courts Only

## దేశవ్యాప్తంగా ఇక వర్షాలే వర్షాలు.. దక్షిణ భారతం సహా కుండపోత..

భారతదేశ వ్యాప్తంగా ఇక కుండపోత వర్షాలు కురిసే అవకాశం ఉంది. దేశంలోని ప్రధాన నగరాలు, ప్రాంతాల్లో ఇవాళ(బుధవారం) భారీ వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై ఉండగా, ముంబై, ఢిల్లీ, బెంగాల్‌లో భారీ వర్షాలు పడుతున్నాయి. ముంబై, బెంగాల్‌లో ఈ ఉదయం నుంచీ భారీ వర్షాలు కురుస్తుండగా, దేశ రాజధాని ఢిల్లీలో కుండపోత వర్షం కురిసే అవకాశం ఉందని IMD చెబుతోంది. మే 21 బుధవారం దేశ రాజధానిలో ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేయడంతో సమ్మర్‌లో ఎండ వేడిమితో అల్లాడుతున్న ఢిల్లీకి కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. రేపు కూడా ఢిల్లీలో ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

## అనధికార వైద్య కాలేజీల్లో చేరొద్దు: ఎన్ఎంసీ

న్యూఢిల్లీ : వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు.. ఎలాంటి గుర్తింపు లేని, లేదా నకిలీ గుర్తింపుతో నడుస్తున్న అనధికార కాలేజీల్లో చేరొద్దని జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) హెచ్చరించింది. దేశంలో కొన్ని కళాశాలలు ఎలాంటి గుర్తింపు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చినట్టు తెలిపింది. ఎంబీబీఎసలో చేరగోరు విద్యార్థులు ఎన్ఎంసీ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన మెడికల్ వర్సిటీలను పరిశీలించి ఎంచుకోవాలని సూచించింది. ఇక, విదేశాల్లో ఏ యూనివర్సిటీని ఎంచుకున్నా అక్కడే కనీసం 54 నెలల పాటు కోర్సు చేయాలని, 12 నెలల పాటు అదే దేశంలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాలని పేర్కొంది. వారికి మాత్రమే ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ లైసెన్స్(ఎఫఎంజీఎల్) లభిస్తుందని వివరించింది.



## యోగాకు గుర్తింపు తెచ్చిన వ్యక్తి మోదీ

అమరావతి: యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ప్రధాని నరేంద్ర మోదీ అని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఉండవల్లిలో 'యోగాంధ్ర' వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచంలో అన్ని దేశాల్లో నిర్వహించుకునే కార్యక్రమం యోగా అన్నారు. ఇది కొద్ది మందికో, కొన్ని ప్రాంతాలకో పరిమితమైంది కాదని.. ప్రపంచానికి భారత్ అందిస్తున్న గొప్ప వరమని పేర్కొన్నారు. అందరి జీవితాల్లో యోగా భాగం కావాలన్నారు.

ఒత్తిడి నుంచి ఉపశమనం కావాలంటే దీన్ని సాధన చేయాలని సూచించారు."ఫొటోలు, ఈవెంట్ కోసం ఒకరోజు చేసే కార్యక్రమం కాదిది. ప్రతిఒక్కరిలో ప్రగాఢమైన మార్పు తీసుకొచ్చే కార్యక్రమమిది. జీవనశైలిలో భాగమయ్యేలా యోగాను ముందుకు తీసుకెళ్లాలి. నేటి నుంచి నెలపాటు యోగాంధ్ర-2025 నిర్వహిస్తున్నాం. కనీసం 2 కోట్ల మందికి తక్కువ కాకుండా పాల్గొనాలన్నది సంకల్పం. కనీసం 10 లక్షల మందికిపైగా యోగా సర్టిఫికెట్లు ఇవ్వాలనేది లక్ష్యం. జూన్ 21న విశాఖలో 5 లక్షల మందితో ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు కార్యక్రమం చేపడతాం.

ఉదయం 7 నుంచి 8 గంటల వరకు కార్యక్రమం నిర్వహిద్దాం. విశాఖలో జరిగే యోగా ఈవెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటారు. పాఠశాలల్లోనూ ఇక నుంచి రోజూ ఒక గంట యోగా ఉంటుంది" అని చంద్రబాబు తెలిపారు.



## దేశానికే వన్నె తెచ్చిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ప్రధానిగా దేశానికే వన్నె తెచ్చిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. ఆర్థిక, సరళీకృత విధానాలతో భారత్‌ను బలమైన దేశంగా రాజీవ్‌గాంధీ నిలబెట్టారన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పించి ప్రభుత్వాల ఏర్పాటులో యువతకు భాగస్వామ్యం కల్పించారని చెప్పారు. "పహల్గాం ఘటన నేపథ్యంలో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ స్ఫూర్తిని దేశంలో ప్రతిఒక్కరూ గుర్తు తెచ్చుకున్నారు. దేశ పౌరులపై దాడులకు తెగబడితే ఆనాడు ఇందిరమ్మ పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పారు. మా దేశాన్ని మేం రక్షించుకోగలుగుతాం.. ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదని ఆమె ఆనాడే స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబితే కాల్పుల విరమణ చేసిన పరిస్థితి ఇప్పటి కేంద్ర ప్రభుత్వానిది. రాహుల్ గాంధీని విమర్శించడం ద్వారా భాజపా నాయకులు తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్రానికి అండగా నిలబడాల్సిన సమయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బయటకు రాలేదు. మేం బయటకు వచ్చి మద్దతు తెలిపాం. ఆనాడు కనీసం మమ్మల్ని అభినందించని వ్యక్తి.. ఈరోజు రాహుల్ గాంధీని విమర్శిస్తున్నారు. తన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే కిషన్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారు. సెక్రటేరియట్ దగ్గర రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే కొందరు విమర్శలు చేశారు. సంకుచిత మనస్తత్వం కలిగిన కొందరు ఆ వ్యాఖ్యలు చేశారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర గాంధీ కుటుంబానిది, కాంగ్రెస్ పార్టీది. దేశ రక్షణ కోసం భారత జవాన్లకు అండగా నిలబడతాం.. అది మా బాధ్యత. దేశ సమగ్రత విషయంలో మేం రాజకీయాలు చేయం.. దేశ భద్రతకు కట్టుబడి పనిచేస్తాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు



## ఏపీకి కుంకీ ఏనుగులను అప్పగించిన కర్ణాటక ప్రభుత్వం

బెంగళూరు: ఏపీకి ఆరు కుంకీ ఏనుగులను కర్ణాటక ప్రభుత్వం అప్పగించింది. బెంగళూరులోని విధానసౌధలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. కుంకీ ఏనుగుల అప్పగింత, వాటి సంరక్షణకు సంబంధించిన డాక్యుమెంట్లను పవన్‌కు సిద్ధరామయ్య అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ కుంకీ ఏనుగులు ఇచ్చిన కర్ణాటక ప్రభుత్వానికి, సీఎం సిద్ధరామయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి సాయం అడిగినా కర్ణాటక ప్రభుత్వం ముందుకొస్తోందన్నారు. ఏపీ, కర్ణాటక మధ్య సహకారం ఇలాగే కొనసాగాలని పవన్ ఆకాంక్షించారు. కుంకీ ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ఏపీ, కర్ణాటక మధ్య 9 ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. పంటపొలాల్ని నాశనం చేస్తున్న అడవి ఏనుగులను నియంత్రించేందుకు కుంకీ ఏనుగులను రంగంలోకి దించుతారు.

**కుంకీ ఏనుగులు ఏం చేస్తాయ్?...** కుంకీలు పూర్తి స్థాయిలో శిక్షణ పొందిన ఏనుగులు. ఎక్కడైనా ఏనుగుల గుంపు దాడికి దిగినప్పుడు కుంకీలను రంగంలోకి దింపుతారు. ఏనుగులను తరిమికొట్టడంలో ఇవి కీలక భూమిక పోషిస్తాయి. కొన్నిసార్లు గాయపడిన లేదా చిక్కుకున్న అడవి ఏనుగును రక్షించడానికీ వీటిని ఉపయోగిస్తారు. సాధారణంగా కుంకీ ఏనుగులుగా మగవాటినే ఎంపిక చేసుకుంటారు. ఎందుకంటే ఇవి మాత్రమే ఒంటరిగా సంచరిస్తుంటాయి.

వీటిని బంధించి కొన్ని నెలల పాటు శిక్షణ ఇస్తారు. తర్వాత ఆపరేషన్ల కోసం వాడుతుంటారు. ఏనుగుల గుంపును అడవిలోకి తిరిగి పంపించేంత వరకు ఇవి విశ్రమించవు. కొన్నిసార్లు పంట పొలాలపైకి వచ్చిన ఏనుగులతో ఇవి తలపడాల్సి ఉంటుంది కూడా. అందుకే పోరాడడంలోనూ వీటికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు.



## జోరు వాన

## హైదరాబాద్‌లో దంచికొడుతున్న వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

హైదరాబాద్: భాగ్యనగరంలో పలు ప్రాంతాల్లో వర్షం దంచికొడుతోంది. చాలాచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ ఉండగా వాతావరణం ఒక్కసారిగా మారి భారీ వర్షం పడుతోంది. వర్షం ధాటికి లోతట్టు ప్రాంతాలతో పాటు రహదారులు జలమయమవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాతబస్తీతో పాటు శివారు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుండటంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. నగరంలోని మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్, కొత్తపేట, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, లక్డీకపూల్, ఫిలింనగర్, బోరబండ, యూసఫ్‌గూడా, తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో కూడా వర్షం పడుతోంది. వర్షం ధాటికి కరెంట్ సరఫరా నిలిచిపోయింది. మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతుండటంతో జీహెచ్ఎంసీ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

**పలు జిల్లాల్లో భారీ వర్షం...** తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షం దంచికొడుతోంది. ఉమ్మడి వరంగల్, నల్గొండ, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షం పడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, నెల్లికుదురు, ఇనుగుర్తి, బయ్యారం, డోర్నకల్, మరిపెడ, నర్సంపేట, నర్సింహులపేటలో భారీ వర్షం కురుస్తోంది. తెలంగాణ వ్యాప్తంగా వాతావరణం మేఘావృతమైంది. భారీ వర్షం కురుస్తోండటంతో ఎండల నుంచి ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్, కోదాడ, నల్లబండగూడెం, హుజూర్‌నగర్, చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోంది. సూర్యాపేట జిల్లాలోని నల్లబండగూడెం సమీపంలో ఓ చెట్టు కింద మేకల మందపై పిడుగు పడటంతో 39 మేకలు మృతిచెందాయి. అయితే మరో ఐదు రోజులు భారీ వర్షసూచన ఉందని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఈరోజు, రేపు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.



## ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో సీఎం దంపతులు

కుప్పం పట్టణం: ఏపీ సీఎం చంద్రబాబు కుప్పంలో పర్యటిస్తున్నారు. సతీమణి నారా భువనేశ్వరితో కలిసి ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో ఆయన పాల్గొన్నారు.

సీఎం దంపతులకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారి విశ్వరూప దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు దంపతులు సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాష్ట్రానికి మంచి జరగాలని సీఎం ప్రార్థించారు. మరోవైపు అమ్మవారి విశ్వరూప దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. ఏడాదికి ఒకసారి మాత్రమే ఈ దర్శనం కల్పిస్తారు.

## కాంగ్రెస్, భాజపా నాటకంలో భాగంగానే కేసీఆర్‌కు నోటీసులు: కేటీఆర్



నల్గొండ: నోటీసులు ఎన్ని ఇచ్చినా ధైర్యంగా ఎదుర్కొంటామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడంపై ఆయన స్పందించారు. చట్టాలు, న్యాయవ్యవస్థపై తమకు నమ్మకం ఉందన్నారు. కాంగ్రెస్, భాజపా ఉమ్మడి నాటకంలో భాగంగానే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. ప్రజా సమస్యలు గాలికొదిలి ఇలాంటి పనులు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. దిక్కుతోచని పరిస్థితుల్లోనే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని విమర్శించారు. ప్రజాపాలన.. కమీషన్ల పాలనగా మారిందని ఆరోపించారు. "ఎన్ని నోటీసులు ఇచ్చినా అవన్నీ దూదిపింజల్లా ఎగిరిపోతాయి. న్యాయం, ధర్మం గెలుస్తాయి.. నిజాయతీ ఎప్పటికీ ఓడిపోదు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలి చనిపోతే ఇంకా మృతదేహాలు బయటకు తీయలేదు. నల్గొండలో సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలింది.. ఇప్పటికీ చర్యల్లేవు. ఆరు గ్యారంటీలు అమలు చేయలేని చేతకాని ప్రభుత్వం ఇది. తులం బంగారం ఏమైంది. రూ.4 వేల పింఛన్ల మాట ఏమైంది" అని కేటీఆర్ ప్రశ్నించారు.

## ఏపీ ఆర్థిక శాఖ ప్రధాన కార్యాలయంలో అగ్నిప్రమాదం



మంగళగిరి: ఏపీ ఆర్థిక శాఖ ప్రధాన కార్యాలయమైన నిధి భవన్‌లో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. ఉద్యోగులంతా విధుల్లో ఉండగానే భవనం రెండో అంతస్తులో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో సుమారు 300 మంది ఉద్యోగులు భయంతో కిందికి పరుగులు తీశారు. సెంట్రల్ ఏసీలో షార్ట్ సర్క్యూటే కారణమని భావిస్తున్నారు. ఈ ప్రమాదంతో కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లు, దస్త్రాలు కాలిపోయి ఉండవచ్చని సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల జీతభత్యాలు, వివిధ శాఖలకు సంబంధించిన లావాదేవీల బిల్లులు ఉండటంతో ఎంత నష్టం జరిగిందనేది ఇంకా అంచనా వేయలేదు. ఆన్‌లైన్ సిస్టం అయినప్పటికీ కంప్యూటర్లు కాలిపోవడం వల్ల లావాదేవీలకు సంబంధించిన పూర్తి సమాచారం మంటల్లో కాలిపోయి ఉండవచ్చని ఉద్యోగులు భావిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది మినహా ఎవరినీ లోపలికి అనుమతించడం లేదు.

**పరిశీలించిన మంత్రి పయ్యావుల...** నిధి భవన్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు సకాలంలో స్పందించడంతో ఎలాంటి నష్టం జరగలేదని మంత్రి తెలిపారు.

## కాళేశ్వరం విచారణకు హాజరువుతా



హైదరాబాద్, మే 21: కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు వంద శాతం హాజరవుతానని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. అయితే ఇంత వరకు ఎలాంటి నోటీసులు తనకు అందలేదని ఆయన తెలిపారు. అయితే తనకు నోటీసులు పంపిన విషయం మీడియా ద్వారా తెలుసుకున్నానని చెప్పారు.

తనకు నోటీసులు అందిన అనంతరం ఈ విషయాన్ని పార్టీలో చర్చించి.. అధిష్టానం నిర్ణయానికి అనుగుణంగా తాను ముందుకు వెళ్తానన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని శామీర్‌పేటలో ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నీది.. నువ్వు ఎలాంటి విచారణ అయినా చేయి అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. గతంలో దేవరాయాంజాల్ భూముల విషయంలో కేసీఆర్ చేసిన తప్పే.. నేడు నువ్వు చేస్తున్నావంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఈటల రాజేందర్ మండిపడ్డారు. నువ్వు మమల్ని బెదిరిస్తే భయపడమన్నారు. కేంద్రంలో తమ పార్టీనే అధికారంలో ఉందని ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ గుర్తు చేశారు. నీ చిట్టా అంతా తమ చేతిలో ఉందన్నారు. నీ దిక్కుమాలిన చిల్లర గాళ్ళతో మాట్లాడిస్తే తాను వెనక్కి పోనంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ ఈటల ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు.



# పాక్‌తో దౌత్య యుద్ధం మొదలు.. ఆ 33 దేశాలకే ఎందుకు..?

దిల్లీ: సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్థాన్ అందిస్తోన్న ప్రోత్సాహాన్ని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టడానికి ఏర్పాటుచేసిన అఖిలపక్ష బృందాల పర్యటన బుధవారం ప్రారంభమైంది. జేడీయూ ఎంపీ సంజయ్ ఝా, శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే నేతృత్వంలోని రెండు బృందాలు ఈరోజు విదేశాలకు బయల్దేరారు. సంజయ్ బృందం జపాన్‌కు బయల్దేరగా.. రాత్రి తొమ్మిది గంటల సమయంలో యూఏఈకి శిందే టీమ్ ప్రయాణం మొదలుపెట్టనుంది. సంజయ్ బృందంలో భాజపా ఎంపీలు అపరాజితా సారంగి, బ్రిజ్‌లాల్, హేమాంగ్ జోషి, ప్రధాన్ బారువా, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన అభిషేక్ బెనర్జీ, సీపీఎంకు చెందిన జాన్ బ్రిట్టాస్, కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్, మాజీ దౌత్యవేత్త మోహన్ కుమార్ సభ్యులుగా ఉన్నారు. వారు ఇండోనేసియా, మలేసియా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్‌లలో పర్యటించనున్నారు. ఇక శిందే బృందం.. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సియెర్రా లియోన్, లైబీరియా వెళ్లనుంది.

**ఆ 33 దేశాలే ఎందుకు..?...** వివిధ పార్టీలకు చెందిన ఎంపీలు, మాజీ ఎంపీలతో కూడుకున్న ఏడు బృందాలను ఏర్పాటుచేయగా వాటిలో మూడింటికి మంగళవారం విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ పలు అంశాలను వివరించారు. అలాగే ఈ బృందాలు పర్యటించనున్న 33 దేశాలను దేని ఆధారంగా ఎంచుకున్నారో వివరించారు. ఆ విషయాన్ని భాజపా ఎంపీ అపరాజితా సారంగి మీడియాకు వెల్లడించారు. “ఆ 33లో 15 ఐరాస భద్రతామండలిలో సభ్యదేశాలు (5 శాశ్వత, 10 తాత్కాలిక సభ్యదేశాలు). మరికొన్ని భవిష్యత్తులో భద్రతా మండలిలో చేరబోయే దేశాలు” అని తెలిపారు. అలాగే అంతర్జాతీయ అంశాలపై భారత వాణిని వినిపించే దేశాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇక, తమ అంతర్జాతీయ పర్యటనల్లో భాగంగా ఈ బృందాలు ఆయా దేశాల ప్రభుత్వాధినేతలతోపాటు పార్లమెంటేరియన్లు, మేధావులు, మీడియా సభ్యులను కలుస్తారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత బలగాలు ‘ఆపరేషన్ సిందూర్’ రూపంలో ఉగ్రస్థావరాలపై ఉక్కుపాదం మోపాయి.

పీఓకే, పాక్‌లోని ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేశాయి. తర్వాత పాక్ రెచ్చగొట్టే చర్యలను సమర్థవంతంగా తిప్పికొట్టాయి. ఈ నేపథ్యంలోనే కేంద్రం ఈ దౌత్య యుద్ధాన్ని ప్రారంభించింది.



# సోనియా-రాహుల్‌పై ఈడీ సంచలన ఆరోపణ

దిల్లీ: నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంచలన ఆరోపణలు చేసింది. ఈ నేరంలో వారు రూ.142 కోట్లు లబ్ధి పొందారని ఆరోపించింది. నేరపూరిత ఆర్జనతో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని, తర్వాత కూడా వారు అదే పంథాను కొనసాగించారని పేర్కొంది. బుధవారం దిల్లీ ప్రత్యేక కోర్టులో జరిగిన విచారణలో భాగంగా ఈడీ ఈ వాదనను వినిపించింది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఇందులోభాగంగా నోటీసులు జారీ చేసింది. ఆయా ఆస్తుల్లో ఉన్నవారు ఖాళీ చేయాలని పేర్కొంది. అద్దెకు ఉంటున్నవారు ఇకపై తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని తెలిపింది. అక్రమ చెలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ (8) నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకొనే ప్రక్రియ చేస్తున్నామని తెలిపింది. ఆస్తులు ఉన్న ప్రాంతాల్లో (దిల్లీ, ముంబయి, లఖ్‌నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ.. అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా విచారణ జరిగింది.



# సరిహద్దు రాష్ట్రాల నుంచి పాక్‌కు వెళ్లే సందేశాలపై నిఘా..!

ఆపరేషన్ సిందూర్ మొదలైన నాటినుంచి జమ్మూకశ్మీర్ సహా సరిహద్దు రాష్ట్రాల నుంచి పాక్‌కు వెళ్లిన కమ్యూనికేషన్లపై కేంద్ర నిఘా సంస్థలు దృష్టిపెట్టాయి. దీనిలో భాగంగా అనుమానాస్పదంగా అనిపించిన ఫోన్ సంభాషణలు, చాటింగ్‌లు, ఈమెయిల్స్, మెసేజ్‌ల వివరాలను సేకరించడం మొదలుపెట్టాయి. భారత్‌లోనే ఉంటూ ఉగ్రవాదులకు సహకరిస్తున్న స్లీపర్ సెల్స్ వంటి వారి వివరాలు సేకరించడమే దీని లక్ష్యం. ఈక్రమంలో భాగంగా ఈమెయిల్, టెలిఫోన్ కాల్స్, మెసేజ్‌లు, చాటింగ్‌లు, ఎన్‌క్రిప్టెడ్, పాపులర్ సోషల్ మీడియా యాప్ ద్వారా జరిగిన కమ్యూనికేషన్ల వాల్యూమ్‌ల ఆధారంగా సేకరిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌లో 9 ఉగ్ర స్థావరాల ధ్వంసం తర్వాత భారత్‌లోని ఉగ్రసానుభూతిపరులు వారి హ్యాండిలర్లు, ఐఎస్ఐ ఆపరేటివ్‌లతో ఏమైనా కనెక్ట్ అయ్యారేమో గుర్తించేందుకు ఈ చర్యలు చేపట్టారు. “ఉగ్ర సంస్థ లేదా దాని హ్యాండ్లర్లతో ఎవరైనా టచ్‌లో ఉన్నారేమో గుర్తించడమే ఈ చర్యల వెనక లక్ష్యం. మే7 తర్వాత వీరి కదలికలు అనుమానంగా ఉంటే అరెస్టు చేసి ప్రశ్నిస్తాము” అని ఓ సీనియర్ భద్రతాధికారి ఓ ఆంగ్ల పత్రికకు వెల్లడించారు. ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాల్లోని వారు దళాల కదలికలు, ఆయుధాల వివరాలు వంటివి ఏమైనా పాక్‌కు లీక్ చేశారా అనే అంశంపై దృష్టిపెట్టినట్లు వెల్లడించారు. దీంతోపాటు ఇప్పటి వరకు భద్రతా ఏజెన్సీ దృష్టిలోపడకుండా ఉన్న ఓవర్ గ్రౌండ్ వర్కర్ల నెట్‌వర్క్‌ను గుర్తించేందుకు కూడా ఈ చర్య ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పాకిస్థాన్‌తో సంబంధం ఉన్న గూఢచర్య నెట్‌వర్క్‌పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. రెండు వారాల వ్యవధిలో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా సహా 12 మందిని అరెస్టు చేశారు. పంజాబ్‌లో ఆరుగురు, హరియాణాలో ఐదుగురు, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. నిందితులు పాక్ నిఘా వర్గాలకు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు ఇప్పటివరకు చేపట్టిన దర్యాప్తులో వెల్లడైందన్నారు.



# హయత్‌నగర్‌లో రోడ్డు ప్రమాదం

హయత్‌నగర్: హైదరాబాద్ శివారు హయత్‌నగర్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. కుంట్లూరులో డీసీఎం, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందారు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. మృతులను కుంట్లూరుకు చెందిన పిన్నింటి చంద్రసేనారెడ్డి (24), చుంచు త్రినాథ్ రెడ్డి (24), చుంచు వర్షిత్ రెడ్డి (23)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో గాయపడిన అలిమేటి పవన్ కల్యాణ్ రెడ్డిని చికిత్స నిమిత్తం హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.


# మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావుకు షోకాజ్ నోటీసులు



హైదరాబాద్: తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావుకు మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబా షోకాజ్ నోటీసులు ఇచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడికి వ్యతిరేకంగా గాంధీ భవన్‌లోనే ధర్నా చేసినందుకు చర్యలు తీసుకున్నారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

**అసలేం జరిగిందంటే..** పార్టీ, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఇటీవల సునీతారావు ఆధ్వర్యంలో మహిళా నేతలు గాంధీభవన్‌లోని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఛాంబర్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో మహిళా కాంగ్రెస్ తీవ్రంగా శ్రమించిందని.. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావొస్తున్నా పార్టీ, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల విషయంలో మహిళా కాంగ్రెస్‌కు అన్యాయం జరుగుతోందని ఆమె పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఎన్నిసార్లు కలిసినా ముఖ్యమంత్రిని కలవండి అని చెబుతున్నారని తెలిపారు.

# మారని అధికారులు.. జడ్పీ ఆఫీస్‌లో జగన్ ఫోటో.. మండిపడ్డ టీడీపీ ఎమ్మెల్యేలు



అనంతపురం, మే 21: జిల్లాలోని జడ్పీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోటోను స్టోర్ పక్కన ఉంచడంపై టీడీపీ ఎమ్మెల్యేలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు (బుధవారం) జిల్లాలో జడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కూడా అధికారుల్లో మార్పు రాని పరిస్థితి. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఫోటోను జడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ ఛాంబర్‌లో ఉంచి, ఏపీ సీఎం చంద్రబాబు ఫోటోను మాత్రం స్టోర్ రూం వద్ద పెట్టారు. దీంతో సమావేశానికి వచ్చిన టీడీపీ ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అమిలినేని సురేంద్ర బాబు, ఎంఎస్ రాజు.. గిరిజమ్మ ఛాంబర్‌లో జగన్ ఫోటోను చూసి జడ్పీ సీఈవోపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ నిబంధన ప్రకారం జగన్ ఫోటో పెడతారని టీడీపీ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యాలయంలో మాజీ సీఎం చిత్రపటాన్ని ఎలా ఉంచుతారని జడ్పీ సీఈవోపై మండిపడ్డారు. వెంటనే జగన్ మోహన్ రెడ్డి ఫోటోను తీసివేయించి.. ఆ స్థానంలో జాతిపిత మహాత్మాగాంధీ, సీఎం చంద్రబాబు ఫోటోలను ఎమ్మెల్యేలు పెట్టారు. సీఎం చంద్రబాబు చిత్రపటాన్ని జడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ ఛాంబర్‌లో ఎమ్మెల్యేలు ఏర్పాటు చేయించారు. కాగా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావొస్తున్నా ఉన్నతాధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో ఉండాల్సిన స్థానంలో మాజీ సీఎం జగన్ ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో ఉంచుతున్నారు. ప్రధానంగా జిల్లా పరిషత్ కార్యాలయాల్లో ఎక్కడ చూసినా జగన్ ఫోటోలు ఉండటంపై అనంత టీడీపీ ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏ విధంగా జగన్ ఫోటోను ఉంచారంటూ జడ్పీ సీఈవోపై మండిపడ్డారు. ప్రభుత్వం మారినా కూడా ఉన్నతాధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదని ఫైర్ అయ్యారు. జడ్పీ చైర్ పర్సన్ ఛాంబర్‌లో కూడా మాజీ ముఖ్యమంత్రి ఫోటోలు ఉంచుతున్నారని, సీఎం చంద్రబాబు ఫోటోలు ఉంచడం లేదని విరుచుకుపడ్డారు. అప్పటికప్పుడు జగన్ ఫోటోలను తీయాలని తెలుగు దేశం ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. దీంతో వెంటనే జగన్ ఫోటోను తీసివేసి సీఎం చంద్రబాబు ఫోటోను పెట్టారు.

# మంత్రి ఉత్తమ్ హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్




కోదాడ: తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌ను అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పలు లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పరిశీలనకు హైదరాబాద్ నుంచి ఆయన బయల్దేరారు. ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం రావడంతో మేళ్లచెరువులో దిగాల్సిన హెలికాప్టర్.. కోదాడలోనే అత్యవసరంగా ల్యాండ్ అయింది. వాతావరణం అనుకూలించకపోవడంతో కోదాడలో దిగినట్లు మంత్రి సిబ్బంది తెలిపారు. అనంతరం రోడ్డుమార్గంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్‌కు బయల్దేరివెళ్లారు.

# విశాఖలో సెమీ రింగ్‌రోడ్డు నిర్మిస్తాం: మంత్రి నారాయణ

విశాఖపట్నం: భోగాపురం ఎయిర్‌పోర్టు వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తి అవుతుందని మంత్రి నారాయణ తెలిపారు. ఈ ఎయిర్‌పోర్టును అనుసంధానం చేస్తూ 22 రోడ్లు ప్రతిపాదించామని, వాటిలో 15 రోడ్లు పూర్తి అవుతున్నాయని తెలిపారు. 115 రోజుల్లో మిగిలిన ఆరు రోడ్లకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేసి, జాతీయ రహదారి సంస్థతో సమన్వయం చేసుకొని పూర్తి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులపై మంత్రి మీడియాతో మాట్లాడారు. ‘టిడ్కో ఇళ్లు పూర్తి చేయాలంటే రూ.7వేల కోట్లు కావాలి. వైకాపా హయాంలో అప్పులు చేసి వాటిని పక్కదారి పట్టించారు. 2014-2019 మధ్య 7లక్షల టిడ్కో ఇళ్లు ప్రతిపాదించాం. అవి వైకాపా హయాంలో ఆగిపోయాయి. కేవలం 2లక్షల ఇళ్లు కూడా పూర్తిచేయలేకపోయారు. ఎంత ఖర్చయినా మహిళలకు టిడ్కో ఇళ్లు ఇవ్వాలని సీఎం చంద్రబాబు సంకల్పించారు. ఈ దసరాకి టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తాం. ప్రతి ఇంటికి నీరిచ్చేలా 2021లో అమృత్ పథకం కోసం కేంద్రం నిధులిస్తే వైకాపా ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వలేదు. ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. సీఎం చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి మళ్లీ నిధులు వచ్చేలా చేశారు. రూ. 834 కోట్ల పనులు అమృత్ పథకం కోసం నిర్దేశించాం. కొద్ది నెలల్లో అమృత్ పథకం ద్వారా సర్ఫేస్ వాటర్ వస్తాయి. విశాఖ మెట్రోకి సంబంధించి అక్టోబర్ నెలలో పనులు మొదలుపెడతాం. డబుల్ డెక్కర్ మెట్రో కింద డీపీఆర్ ఇచ్చాం. కోటి మంది ప్రజలు ఉన్న హైదరాబాద్‌కు రింగురోడ్డు ఉంది. అదే తరహాలో విశాఖలో సెమీ రింగ్‌రోడ్డు నిర్మిస్తాం”అని మంత్రి నారాయణ తెలిపారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానానికి తప్పిన ప్రమాదం



హైదరాబాద్, మే 21: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో లుఫ్తాన్సా విమానానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. బుధవారం ఉదయం ఫ్రాంక్‌ఫర్ట్ బయలుదేరిన విమానం రన్ వే మీదకు వెళ్లిన వెంటనే ముందు టైరులో సమస్య ఏర్పడింది. ఈ విషయాన్ని పైలట్ వెంటనే గుర్తించారు. దీంతో ఈ విషయాన్ని ఎయిర్ పోర్ట్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. అనంతరం వారి సూచన మేరకు విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోకి మళ్లించారు. ఈ సమయంలో విమానంలో 190 మంది ప్రయాణికులు ఉన్నారు. విమానం టైర్‌ను ఎయిర్ పోర్టులోని సాంకేతిక సిబ్బంది పరిశీలిస్తున్నారు. మరోవైపు కొన్ని గంటల ఆలస్యంగా ఈ విమానం బయలుదేరుతోందని ఎయిర్‌పోర్ట్ అధికారులు వెల్లడించారు.



# వైఫల్యానికి కూడా రివార్డులా..?

పాకిస్థాన్ ప్రభుత్వం తన సైనిక బలగాల ప్రధానాధికారి ఆసీమ్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి కల్పించిన సంగతి తెలిసిందే. ఈ పదోన్నతిపై భాజపా ఐటీ సెల్ హెడ్ అమిత్ మాలవీయ స్పందించారు. వైఫల్యానికి కూడా రివార్డులుంటాయా అంటూ పాకిస్థాన్‌ను ఎద్దేవా చేశారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ‘వైఫల్యానికి కూడా రివార్డులుంటాయనే దానికి ఇదే ఉదాహరణ. భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ చావుదెబ్బతింది. 9 ఉగ్రస్థావరాలను నేలకూల్చాం. 13 వైమానిక స్థావరాలు, జాతీయ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో పాటు వందలాది డ్రోన్‌లను ధ్వంసం చేశాం. ఆ దేశానికి చెందిన 70 మందికి పైగా సైనిక సిబ్బంది మరణించారు. మన దెబ్బ తట్టుకోలేక కాల్పుల విరమణకు అభ్యర్థించింది. అయినప్పటికీ.. పాక్ ఆర్మీ చీఫ్ ఆసీమ్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి కల్పించారు. పదే పదే వైఫల్యాలు ఎదురైనప్పటికీ ఆనందాన్ని ఆస్వాదించే యువరాజు ఒకరు మాత్రమే ఉన్నారు. అది ఎవరో మనందరికీ తెలుసు’ అని మాలవీయ పేర్కొన్నారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ ఆపరేషన్ సిందూర్ ను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో భాగంగా పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రస్థావరాలను మన బలగాలు నేలమట్టం చేశాయి. దీన్ని సహించలేని పాక్ సైన్యం మనపై ఎదురుదాడికి ప్రయత్నించింది. వీటిని మన బలగాలు తిప్పికొట్టి పాక్‌ను చావుదెబ్బ తీశాయి. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతోంది. ఈ క్రమంలోనే మునీర్‌కు పదోన్నతి కల్పిస్తూ పాక్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో మునీర్ పాకిస్థాన్ చరిత్రలో ఆ స్థాయి పొందిన రెండో వ్యక్తి అయ్యారు.

ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. భారత్‌తో ఇటీవల జరిగిన సైనిక సంఘర్షణలో కీలక పాత్ర పోషించిన కారణంగా ఆయనకు పదోన్నతి కల్పించినట్టు పాక్ ప్రభుత్వం ప్రకటించింది.

## హనుమాన్ జయంతి విశేష అభిషేకములు హనుమత్ హోమం

సత్తెనపల్లి( లక్ష్యం ప్రతినిధి మే 21 )సత్తెనపల్లి పట్టణం లో మహారాష్ట్ర వీధిలోని శ్రీ భక్తాంజనేయ స్వామి వారి దేవస్థానంలో హనుమత్ జయంతోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది .రెండో రోజు స్వామివారికి ఆలయ అర్చక స్వామి విజయ నరసింహా చార్యులుఅనంతరం విశేష అభిషేకములు, హనుమత్ హోమం ,విశేష పుష్పాలం



కరణ కార్యక్రమాలు జరిగాయి ఈ కార్యక్రమంలో తుమ్మల. శ్రీపతి, కే బలరామకృష్ణ , వెంకటేశ్వర్లు, కృష్ణ సాయి, శివప్రసాద్, పవన్, వసుంధర, సుకన్య, ఉష ప్రస్తుతం ఉన్న తేనె. వెంకటేష్, వెంకు బాయ్దేవాలయానికి డమరికాన్ని అందించడం జరిగింది. దేవాలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదం అందించడం జరిగింది .

## ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్.

చిలకలూరిపేట మే 21 (లక్ష్యం ప్రతినిధి)::మండలం లోని గోవింద పురం గ్రామంలో గంగా పార్వతీ సమేత శ్రీ భీమేశ్వర స్వామి మరియు పరివార దేవతల జీవ ధ్వజ, పున ప్రతిష్టా మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుండగా గ్రామ ప్రజలు మరియు భక్త బృందం వారి ప్రత్యేక ఆహ్వానం మేరకు ఆ ప్రతిష్టా మహోత్సవ వేడుకలో



శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్, సోమేపల్లి వెంకటసుబ్బయ్య ముఖ్యఅతిధు లు గా పాల్గొని అమ్మవారు, స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి,తీర్థ ప్రసాదాలు స్వీకరించరు. ఈ ప్రతిష్టా మహోత్సవము లో వారికి గుత్తా యామలయ్య,నీరుకొండ బసవయ్య, పావులూరి చంద్రమౌళి, నీరుకొండ సుబ్బారావు, పెద్ది కిషోర్, కల్లం చంద్రశేఖర్ రెడ్డి, శశిధర్ సాగర స్వాగతం పలికారు.

## అందిస్తే సారం.. అందకుంటే నిస్సారం

గరివిడి : జిల్లాలో ఖరీఫ్ పంటల సాగుకు సమయం సమీపిస్తోంది. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులు తున్నాయని, ఈ నెలాఖరుకు రాష్ట్రానికి చేరే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా. అదే జరిగి వర్షాలు కురిస్తే జూన్లో పంటల సాగు మొదలవుతుంది. రైతులు భూసారం తెలుసుకుని సాగు చేస్తే దిగుబడులు బాగుంటాయి. అవసరమైన భూసార పరీక్షలు పూర్తిచేసి ఫలితాలను విశ్లేషించి రైతులకు అందించాల్సి ఉంది. జిల్లాలో 2024-25 ఖరీఫ్లో సేకరించిన 21,200 మట్టి నమూనాలను మినహాయించి మిగతా భూముల్లో 2025- 26 ఖరీఫ్నకు 28,392 నమూనాలను సేకరించాలనేది లక్ష్యం. ఇప్పటి వరకు 27,930 నమూనాలను సేకరించారు. వాటిలో ఫలితాలు వచ్చినవి 7,517 మాత్రమే. లక్ష్యం ప్రకారం ఇంకా ఫలితాలు రావాల్సిన నమూనాలు 20,875 వరకు ఉన్నాయి. ఖరీఫ్ ప్రారంభంలోగా అందించాలి.

**అయిదేళ్లూ పట్టించుకోలేదు..**

వైకాపా హయాంలో జిల్లాలో భూసార పరీక్షల జోలికి పోలేదు. గత ఖరీఫ్ సీజన్కు ముందు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మట్టి పరీక్షలు చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో గత సీజన్లో పరీక్షలు ఆలస్యమయ్యాయి. సేకరించిన 21,200 నమూనాల ఫలితాలను ఇటీవలే రైతులకు అందించారు. భూసార వివరాలతో కార్డును ముద్రించి ఇచ్చారు. వీటి ఆధారంగా పంటలు సాగు చేయొచ్చు.

కార్డుల రూపంలో అందజేత..: ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పరీక్షలు జరుగుతున్నాయి. రైతుసేవా కేంద్రాల సిబ్బంది పొలాల్లో సేకరించిన మట్టి నమూనాలకు భూసార పరీక్ష కేంద్రంలో 12 రకాల పరీక్షలు చేస్తున్నారు. ఫలితాలను ఎస్హెచ్సీ పోర్టల్లో పొందుపర్చుతున్నారు. ఫలితాల విశ్లేషణ పత్రాలను రైతులకు కార్డుల రూపంలో అందిస్తారు. పొలంలో ఉన్న పోషకస్థాయిలకు అనుగుణంగా ఎరువులను సూచిస్తారు. బి.భానులత, ఏడీ, భూసార పరీక్ష కేంద్రం, విజయనగరం

# యువజన భానుడు మన రాజీవుడు....

## రాష్ట్ర కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి గోవిందు శంకర శ్రీనివాసన్



చిలకలూరిపేట టౌన్ మే 21 (లక్ష్యం ప్రతినిధి) : ప్రపంచంలో ఏ దేశంలో లేని యువ శక్తి భారతదేశంలో ఉందని, దేశ భవిష్యత్తు యువత భవిత మీదే ఆధారపడి ఉందని గ్రహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవితాలలో శాశ్వత వెలుగులు నింపిన యువజన భానుడు మన రాజీవుడని రాష్ట్ర కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి గోవిందు శంకర శ్రీనివాసన్ అన్నారు. భారతదేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ప్రవేశపెట్టి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు చూపించడం కోసం కృషిచేసిన రాజనీతిజ్ఞుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ గారి వర్ధంతి కార్యక్రమం చిలకలూరిపేట కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇంటూరి భవాని వెంకటేష్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు కార్యకర్తలు రాజీవ్ గాంధి చిత్రపటానికి పూలు, పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ అద్దంకి అనిల్ కుమార్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి దేశ ఆర్థిక అభివృద్ధికి బాటలు వేస్తే నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పరిపాలన కాలంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఇవ్వకుండా యువత భవితను నిర్వీర్యం చేశారని విమర్శించారు. నాదెండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ బాజీ మాట్లాడుతూప్రపంచంలోనే అతి పిన్న వయసులో ప్రధానమంత్రిగా ఎన్నికై మిన్నగా పరిపాలన సాగించిన పాలనా దక్షుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం రాధాకృష్ణ మాట్లాడుతూ పూజ్య బాపూజీ కలలుగన్న సంపూర్ణ గ్రామ స్వరాజ్య సాధన కోసం జవహర్ రోజ్గార్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టి ఢిల్లీ నుంచి నేరుగా ప్రతి పల్లె కి నిధులు ఇచ్చి గ్రామాభివృద్ధికి బాటలు వేసిన దార్శనికుడు రాజీవ్ గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ నస్రుద్దీన్ జిల్లా కాంగ్రెస్ నాయకులు సాగి మల్లికార్జునరావు, కాటూరి కోటేశ్వరరావు ఎప్పాల అంజిరెడ్డి తాళ్లూరి నాగేశ్వరరావు రెడ్డెం నర్సిరెడ్డి నాదెండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ బాజీ ఎడ్లపాడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాగి నరసింహారావు కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాలకు చెందిన నాయకులు కారు చోల స్వప్న కుమార్, షేక్ బాజీ, షేక్ మహమ్మద్ రఫీ, సుంకర హరిబాబు, దాసరి శ్యాంబాబు, మిరియాల వెంకటరత్నం, దావల మరియదాసు, ఎరసాని కోటేశ్వరరావు, షేక్ దాదాసాహెబ్, షేక్ మస్తాన్ వలి, కోవూరు రాజా, జొన్నల రాజశేఖర్ రెడ్డి, కుంచాల ఆంజనేయులు, జి గోపి, అన్నపురెడ్డి వెంకటేశ్వర్లు, ఉప్పాల బాబు, పెదలంక వెంకటేశ్వర్లు, ప్రత్తిపాటి కోటయ్య, షేక్ వలి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు

## భీమేశ్వరస్వామి ప్రతిష్ఠా మహోత్సవంలో మాజీమంత్రి ప్రత్తిపాటి



చిలకలూరిపేట మే 21( లక్ష్యం ప్రతినిధి):రూరల్ మండలం గోవిందాపురం గ్రామంలో బుధవారం కన్నుల పండువగా జరిగిన శ్రీ గంగా సమేత భీమేశ్వర స్వామి వారి ప్రతిష్ఠ మహోత్సవంలో మాజీ మంత్రి, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావు పేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలుతో కలిసి స్వామి వారిని దర్శించుకున్న ఆయన, ప్రతిష్ఠ ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. గ్రామస్తులంతా కలిసికట్టుగా స్వామివారి ప్రతిష్ఠామహోత్సవం నిర్వహించడంపై సంతోషం వ్యక్తంచేసిన ప్రత్తిపాటి వారిని అభినందించారు. ప్రత్తిపాటి, ఎంపీ లావు ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మధన్ మోహన్, షేక్ టీడీపీ కరిముల్లా, కామినేని సాయిబాబు, గుత్తా వెంకటేశ్వర్లు, కందుల రమణ, తుబాటి శ్రీహరి, తుపాకుల అప్పారావు, గోపి, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఉద్యోగులపై చర్యలపై ప్రజల్లో మిశ్రమ స్పందన


**తప్పు చేసిందెవరు..?**

**తప్పించుకొని తిరుగుతున్నదెవరు..?**

**చేయని తప్పుకు బాధ్యులు చేశారని కొంతమంది ఉద్యోగుల గోడు**

**ఆ కమిషనర్ పై చర్యలు లేవా?**





చిలకలూరిపేట టౌన్ మే 21 (లక్ష్యం ప్రతినిధి)::చిలకలూరిపేట మున్సిపాలిటీలో సంచలనం రేకెత్తించిన కుంబకోణంలో 10 మంది ఉద్యోగులు సస్పెండ్ కు గురికావడం, పలువురు ఉన్నతాధికారులు శాఖ పరమైన విచారణకు ఆదేశించటం తెలిసిందే. ఒక ఔట్సోర్సింగ్ ఉద్యోగిని చేసిన తప్పుకు సస్పెండ్ అయిన ఉద్యోగులు , ఉన్నతాధికారులు కూడా తప్పు చేసినవారేనా? అనే విషయంలో ప్రజల నుంచి మిశ్రమ స్పందన కనిపిస్తుంది. ఇంకా ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న కొంత మంది ఉద్యోగులను ఎందుకు వదలివేశారు.? సంబంధంలేని వ్యక్తులను ఎందుకు బాధ్యులు చేశారు..అనే విషయంపై విస్తృత స్థాయిలో చర్చ జరుగుతుంది

**అవినీతి జరిగింది ఇలా...**

చిలకలూరిపేట మున్సిపాలిటీలో గతంలోనే వెలుగులోకి వచ్చిన నిధుల దుర్వినియోగ ఘటనపై ప్రస్తుత ప్రభుత్వంలో పురపాలక పరిపాలన శాఖ కఠిన చర్యలు చేపట్టింది. ఔట్సోర్సింగ్ ఉద్యోగి ఐ. గంగాభవాని రూ.34,34,397లను నకిలీ రశీదుల ద్వారా దుర్వినియోగం చేసినట్లు గుర్తించబడింది. ఈ మొత్తం నుండి రూ.12,94,024/-ను తిరిగి చెల్లించినప్పటికీ మిగిలిన రూ.21,40,373లు ఇంకా వసూలు కావాల్సి ఉంది. ఈ అవినీతి ఇలా ఉంటే జూనియర్ అసిస్టెంట్ షరాఫ్గా పనిచేసిన నక్క జెస్సీ ప్రవీణ్ కుమార్ రూ.13,67,185లను బ్యాంకులో జమచేయకుండా దుర్వినియోగం చేసినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనలు గతంలో జరిగితే ఈ ఏడాది కేసులు నమోదు చేయడం విశేషం.ఈ రెండు ఘటనలపై ఈ ఏడాది జనవరి 25వ తేదీ చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేయబడ్డాయి.

**ఆ కమిషనర్ పై చర్యలు లేవా?**

మొదటగా గంగా భవాని ను ఉద్యోగంలో తీసుకొని ఆమెకు షరాఫ్ షీట్ కేటాయించిన కమిషనర్ కు సంబంధం లేదా అయితే గంగాభవాని ఆ మున్సిపల్ కమిషనర్ హయాం నుంచే అవినీతి పాల్పడలేదా దొంగ బిల్లులు ఇచ్చి మున్సిపల్ డబ్బును వాడుకోవడం ప్రారంభం కాలేదా అయితే ప్రారంభం నుంచి ఉన్న ఆ కమిషనర్ పేరు వదిలేసి మిగతా కమిషనర్ల పేర్లను తెరపై తీసుకుని రావడం పై చిలకలూరిపేట ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

**తప్పు చేసిందెవరులి..? తప్పించుకొని తిరుగుతున్నదెవరు..?**

2019 నుంచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అవినీతికి పాల్పడిందని గతంలోనే వెలుగులోకి వచ్చింది. కౌన్సిల్ సభ్యులు సైతం ఈ అవినీతిపై సమావేశాల్లో ప్రశ్నించారు. తప్పు జరిగిందని, తిరిగి నగదు రికవరీ చేయడానికి ప్రయత్నిస్తున్నామని అప్పటి మున్సిపల్ కమిషనర్ తప్పుకొనే ప్రయత్నం చేశారు. అసలు ఈ వ్యవహారంలో గతంలో ముగ్గురు రెవిన్యూ క్లర్కులు (ఏ-1), రెవెన్యూ ఆఫీసర్గా పనిచేసిన వ్యక్తి పేర్లు లేకపోవడం విశేషం. ఇక్కడ ఒక విషయం గమనించాలి. ప్రస్తుతం అవినీతిలో నలుగురు రెవిన్యూ క్లర్కులను సస్పెండ్ చేశారు. ఈ సంఘటన జరిగిందని చెబుతున్న కాలంలో మరో ముగ్గురు రెవెన్యూ క్లర్కులు విధులు నిర్వహించారు. ఈ వ్యవహారంలో వారిని ఎందుకు తప్పించారు. ఆ అనంతరం వచ్చిన వారిపైనే చర్యలు తీసుకున్నారన్నది సమాధానం లేని బేతాళ ప్రశ్న. ఇక్కడే మరో విషయం గమనించాలి. ప్రతి రెవెన్యూ క్లర్కు రెవిన్యూ ఆఫీసర్ కనుసన్నల్లోనే పనిచేయాల్సి ఉంటుంది. ప్రతి పత్రంపై ఆర్వో సంతకం, అజామాషి తప్పని సరి. నలుగురు రెవెన్యూ క్లర్కులపై చర్యలు ఉన్నప్పుడు అప్పుడు బాస్గా వ్యవహరించిన ఆర్వోపై కూడా చర్యలు ఉండాలి కదా. ఇదే క్రమంలో ప్రస్తుతం సస్పెండ్కు గురైన నలుగురు రెవెన్యూ క్లర్కులపై చర్యలు ఉన్నప్పుడు, వారి కన్నా ముందు పనిచేసిన వారిని ఈ వ్యవహారంలో ఎందుకు తప్పించారు.దీంతో ఆర్వోగా పనిచేసిన వ్యక్తిపై ఎందుకు చర్యలు లేవన్నది ప్రజలను తొలుస్తున్న మరో ప్రశ్న. కొసమెరుపు ఏమిటంటే అప్పట్లో ఆర్వోగా పనిచేసిన వ్యక్తి బదిలీపై వెళ్లి తిరిగి పదోన్నతిపై చిలకలూరిపేట మున్సిపల్ కార్యాలయానికి మేనేజర్గా రావడం. ఈ ప్రశ్నలకు ఇప్పుడు సమాధానం వెతకాల్సిన అవసరం ఉందిలి. లిన్యాయం అనేది ప్రతి ఒక్కరికీ సమానంగా వర్తించాలిలి. లినేరం చేసిన వారిని శిక్షించడమే కాదులి, నేరం చేయని వారిని కూడా రక్షించాలిలి. లిన్యాయం అంటే తప్పు చేసిన వారిని శిక్షించడంలి, లితప్పు చేయని వారిని అన్యాయంగా శిక్షించకుండా రక్షించడంలి. లిమరి ఈ దిశగా ఉన్నతాధికారులు ఆలోచిస్తారా...!!:

## పలువురు బైండోవర్

మాచర్ల లక్ష్యం ప్రతినిధి :గుంటూరు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూచనల మేరకు మరియు నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం మాచర్ల ఎక్సైజ్, విజయపురిసౌత్ పోలీసులు చింతలతండా గ్రామములో నాటు సారాయి గురించి దాడులు నిర్వహించారు. దాడుల్లో ఎటువంటి నాటు సారా దొరకలేదు. ఆ గ్రామములోని పదిమంది అనుమానిత వ్యక్తులను మాచర్ల మండల



ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వారి ఎదుట హాజరు పరిచి అండర్ సెక్షన్ 128 బిఎన్ఎన్ఎస్ చట్టం కింద బైండోవర్ చేయడమైనది. మాచర్ల ప్రొహిబిషన్ పరిధిలోని వెల్దుర్తి, మాచర్ల, దుర్గి, మండలములోని వివిధ గ్రామాలను నాటు సారా రహిత గ్రామములుగా మార్చడానికి ప్రజలు సహకరించాలని మాచర్ల ఎక్సైజ్ సీఐ వెంకటరమణ కోరారు.

## మరియదాసును పరామర్శించిన పిన్నెల్లి

మాచర్ల లక్ష్యం ప్రతినిధి :మాచర్ల పట్టణం 30వ వార్డు చెందిన ఆలేటి మరియదాసు అనారోగ్యంతో బాధపడుతున్నాడని



తెలుసుకొని పల్నాడు జిల్లా వై.యస్.ఆర్.సి.పి అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం పరామర్శించారు. మరియదాసు గృహంలో ఆయన్ని పరామర్శించిన పిన్నెల్లి ఆర్థిక సాయం అందించారు. త్వరగా కోలుకుంటారని, కుటుంబానికి తామంతా తోడుగా వుంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో వైసిపి నాయకులు బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి తదితరులున్నారు.

## సమీరా వలన జడ్పి బాలికల హైస్కూల్ కీర్తి పెరిగింది

హెచ్ఎం షేక్ షకీనా


మాచర్ల లక్ష్యం ప్రతినిధి: 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో టాపర్గా నిలిచిన షేక్ సమీరా వలన జడ్పి బాలికల పాఠశాల కీర్తి పెరిగిందని హెచ్ఎం షేక్ షకీనా అన్నారు. ఆమె విలేఖరులతో మాట్లాడుతూ 10వ తరగతి ఫలితాల్లో సమీరా 596/600 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాల గౌరవం కూడ పెంచిందన్నారు. ఈ నేపథ్యంలో ఉండవల్లి సిఎం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మంత్రి లోకేష్ సమీరాకు షైనింగ్ స్టార్గా ఆవార్డు అందించి ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. సమీరాకు జరిగిన సన్మానం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేస్తూ, సమీరాకు జరిగిన సన్మానం



తమపై మరింత బాధ్యత కూడ పెరిగిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ ఆయా స్కూల్స్లో మౌలిక వసతులు, టీచింగ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ గురించి అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇంకా ఏ సదుపాయాలు కల్పిస్తే బాగుంటుందని మీరు అనుకుంటున్నారు అని పిల్లల నుంచి ఫీడ్ బ్యాక్ అడిగి తెలుసుకుని మంత్రి లోకేష్ నోట్ చేసుకున్నట్లు వివరించారు. అవార్డ్ గ్రహీత సమీరాను స్థానిక గర్ల్స్ హైస్కూల్ హెచ్ఎం షేక్ షకీనా, క్లాస్ టీచర్ ఉష, కృష్ణారెడ్డి, ఎస్ వి ఎస్ నాగరాజు, రత్నం,బాలనాగమ్మ, ఆయేషా సుల్తానా సిబ్బంది అభినందించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు వరం

తెనాలి మే 21( లక్ష్యం): ముఖ్యమంత్రి సహాయనిది పేదలకు వరమని ఆంధ్రప్రదేశ్ ఆహారం పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు బుధవారం స్థానిక బోస్ రోడ్ లో జనసేన పార్టీ కార్యాలయం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు తెనాలి నియోజకవర్గ పరిధిలో చికిత్సలు చేయించుకున్న పేదలకు 14 మంది లబ్ధిదారులకు 14 లక్షల 45 వేల 642 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



ప్రజారోగ్య పరిరక్షణే కూటమి తొలి ప్రాధాన్యమని అనారోగ్యాలతో ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు అండనిస్తుందన్నారు 11 నెలల కాలంలో 134 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఒక కోటి 78 లక్షల రూపాయలు అందజేశామన్నారు ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# లిక్కర్ స్కామ్ లో జగన్ జైలుకెళ్లడం ఖాయం : మాజీమంత్రి ప్రత్తిపాటి

### రాష్ట్రం బాగుండాలనుకునేవారంతా జగన్ జైలుకెళ్లాలనే కోరుకుంటున్నారు

### ఆయన జైలుకు వెళితే రాష్ట్రానికి పెట్టుబడులు వరదలా వస్తాయి

### చిలకలూరిపేట మినీమహానాడులో మాజీ మంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు





చిలకలూరిపేటటౌన్ మే 21( లక్ష్యం ప్రతినిధి): గత ఎన్నికల్లో అవినీతికి పాల్పడిన మాజీమంత్రి పోటీ చేసి ఉంటే టీడీపీకి లక్షల్లో మెజారిటీ వచ్చేదని, స్వాతంత్ర్యం వచ్చాక ఎన్నడూ రానంత భారీ మెజారిటీతో 2024 ఎన్నికల్లో తనను గెలిపించారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్ లో జరిగిన తెలుగుదేశం పార్టీ మినీ మహానాడులో పాల్గొన్న ఎంపీ లావు కృష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు తో కలిసి మొదట తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించి, స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రత్తిపాటి కీలక ప్రసంగం చేశారు. గత ఎన్నికల్లో ఓడిపోతానని తెలిసే మాజీమంత్రి తెలివిగా చిలకలూరిపేటలో పోటీచేయకుండా తప్పుకొని గుంటూరుకు చెక్కేసిందని ప్రత్తిపాటి చెప్పారు. ప్రతి కార్యకర్తను సంతోషపరిచేలా అందరికీ న్యాయం చేయాలన్న సదుద్దేశంతోనే తాను పనిచేస్తున్నానని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. కూటమిపార్టీల్లోని ప్రతి ఒక్కరినీ సంతృప్తి పరిచేలా పనిచేయడమే తన లక్ష్యమన్నా రు. 5ఏళ్ల పాటు భయభ్రాంతులతో బతికిన కూటమిపార్టీల కార్యకర్తలు, నాయకులు అందరూ బేధాభిప్రాయాలను పక్కనపెట్టి పనిచేయాలని ప్రత్తిపాటి సూచించారు. పాతతరం ఆలోచనలు విడనాడి కాలానుగుణంగా అందరూ మైండ్ సెట్ మార్చుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని అందరూ కలిసి నడవాలన్నారు. ఇతరపార్టీల్లోని వారు అధికార పార్టీల్లో చేరతామన్నా, భేషజాలు లేకుండా వారిని కలుపుకోవాలన్నారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిపార్టీలే విజయం సాధించాలి**

తాను ఇదివరకటిలా మెతకవైఖరి అవలంబించకుండా అధికారంలో ఉన్న మూడు పార్టీల కోసం అందరినీ కలుపుకొని ముందుకు పోతున్నానని ప్రత్తిపాటి తెలిపారు. భవిష్యత్ లో జరగ బోయే స్థానిక సంస్థల ఎన్నికలలో చిలకలూరిపేట నియోజకవర్గంలో అన్నిస్థానాల్లో కూటమి పార్టీలే విజయం సాధించాలన్నారు. అందరం ఐక్యంగా ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదన్నా రు. చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు ఎంతో కష్టపడుతున్నారనే వాస్తవాన్ని అందరూ గుర్తించాలన్నారు. సామాజిక పింఛన్ రూ. 4వేలు రాష్ట్రంలో తప్ప దేశంలో ఎక్కడా ఇవ్వడం లేదన్నారు. కొత్త రేషన్ కార్డులతో పాటు మూడునెలల్లోనే సూపర్ 6 పథకాలన్నీ ప్రభుత్వం అమలుచేయనుందన్నారు. నియోజకవర్గంలో కూటమిపార్టీల శ్రేణులపై ఈగకూడా వాలనివ్వకుండా చూస్తానని, ఎవరికీ అంత ధైర్యం కూడా లేదనే వాస్తవాన్ని మూడుపార్టీల శ్రేణులు గ్రహించాలని ప్రత్తిపాటి సూచించారు.

**రాష్ట్రం బాగుపడాలనుకునేవారు జగన్ జైలుకెళ్లాలని కోరుకుంటున్నారు**

కూటమిపార్టీలు సమన్వయంతో, ఐకమత్యంగా ముందుకు వెళ్లాలని, అప్పుడే 15 ఏళ్లపాటు మూడుపార్టీలు అధికారంలో ఉంటాయని ప్రత్తిపాటి తెలిపారు. కూటమిప్రభుత్వం అధికారంలో జగన్ కుట్రలు, కుతంత్రాలు సాగవన్నారు. మద్యం కుంభకోణంలో జగన్ జైలుకు వెళ్లడం ఖాయమన్న ప్రత్తిపాటి, రాష్ట్రం బాగుపడాలనుకునేవారంతా ఆయన జైల్లోనే ఉండాలని కోరుకుంటున్నారన్నారు. జగన్ జైలుకు వెళితే రాష్ట్రానికి పెట్టుబడులు రావడం పెరుగుతుంద ని, తద్వారా పరిశ్రమలు ఏర్పాటవుతాయన్నారు.

**బనకచర్ల ప్రాజెక్ట్ పూర్తయితే చిలకలూరిపేట నియోజకవర్గానికి నీటిసమస్యే ఉండదు**

కొండవీడు కోటను పర్యాటక, చారిత్రక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నానన్న ప్రత్తిపాటి, ఇటీవలే ఎంపీ కృష్ణదేవరాయలుతో కలిసి కేంద్ర పర్యాటక మంత్రిని కలిసి మాట్లాడటం జరిగిందన్నారు. అమృత్ పథకం కింద చిలకలూరిపేటకు నేరుగా నాగార్జన్ సాగర్ కెనాల్ నుంచి పైపులైన్లు వేసే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అది పూర్తయితే 50 ఏళ్లవరకు నియోజకవర్గంలో మంచినీటి సమస్యే ఉండదన్నారు. నదుల అనుసంధా నమనే గొప్ప ఆలోచన చంద్రబాబు తప్ప దేశంలో ఎవరూ చేయలేదన్న ప్రత్తిపాటి, బనకచర్ల ప్రాజెక్ట్ పూర్తయితే చిలకలూరిపేటకు నీటిసమస్యే ఉండదన్నారు. గోదావరి నీటిని బనకచర్ల ద్వారా రాయలసీమకు తరలిస్తే రాష్ట్రమే సస్యశ్యామలం అవుతుందన్నారు. ఎంతకష్టపడితే చిలకలూరిపేటకు రూ. 1000కోట్లతో బైపాస్ వచ్చిందో ప్రజలు ఆలోచించాలన్నారు. హైదరాబా ద్ నుంచి నేరుగా ఓడరేవుకు పోయేలా నిర్మించే నూతన రహదారి కూడా చిలకలూరిపేటకు బాగా ఉపయోగపడుతుందని ప్రత్తిపాటి తెలిపారు. నియోజకవర్గంలోని ముస్లిం మైనారిటీ ఆడబిడ్డల విద్య, సంక్షేమం దృష్ట్యా తీసుకొచ్చిన పథకాన్ని దుర్మార్గపు ప్రభుత్వం పక్కనపెట్టిందని, త్వరలోనే దాన్ని పున: ప్రారంభిస్తామని ప్రత్తిపాటి చెప్పారు. నియోజకవర్గం లోని అన్ని లిఫ్ట్ ఇరిగేషన్లను బాగుచేసేందుకు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నా మని, అన్నీ పూర్తయితే నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు నీరందుతుందన్నారు. నియోజక వర్గానికి సంబంధించి పెండింగ్ లో ఉన్న అన్ని అభివృద్ధి పనుల్ని ఎంపీ సహాకారంతో పూర్తి చేస్తానని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

**అవినీతి మంత్రి చేసిన తప్పులు, అరాచకాలకు మూల్యం చెల్లించుకోక తప్పదు**

దోపిడీదారులు, దొంగలు, ముద్దాయిల్ని కారులో పెట్టుకొని పోలీసుల్ని అడ్డుకున్నవారిని ఏమనాలన్న ప్రత్తిపాటి, నియోజకవర్గంలో ఎన్నడూ ఎవరూ ఎరగనంత దోపిడీకి పాల్పడి భ్రష్టు పట్టించారని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తంచేశారు. అవినీతిమంత్రికి వత్తాసు పలికిన దొంగలు ఇప్పటికే ఆమెకు ముఖం చాటేశారన్నారు. అవినీతిమంత్రి చేసిన అన్ని తప్పులు, అరాచకాలు, అవినీతి చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. గతప్రభుత్వంలో వైద్యారోగ్యశాఖలో జరిగిన దోపిడీ వ్యవహారం కూడా త్వరలోనే బయటకు వస్తుందన్నారు. పార్టీల్లోని అనుబంధ విభాగాలను, కార్యకర్తలను ఎప్పటికీ విస్మరించబోమని, పార్టీ బలోపేతమే తన ఏకైక లక్ష్యమని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. 15 ఏళ్లు అధికారంలో ఉండటం కోసం ఎవరు ఎక్కడ తగ్గాలో, ఎక్కడ గౌరవింపబడాలో వారికి వారే ఆలోచించుకోవాలన్నారు.

**టీడీపీకి ప్రజలే ప్రతిపక్షం.. అధికారపక్షం : లావు శ్రీ కృష్ణదేవరాయలు (నరసరావుపేట ఎంపీ)**

గత ఎన్నికల్లో కూటమిపార్టీలకు 92శాతం సక్సెస్ రేటు రావడం అనేది అన్నివర్గాల ప్రజల వల్లనే సాధ్యమైందని, అదే స్వర్గీయ ఎన్టీఆర్ కు నిజమైన నివాళి అని నరసరావుపేట ఎంపీ లావు కృష్ణ దేవరాయలు అన్నారు. టీడీపీకి గెలుపోటములు సహజమని, జనాలకు దగ్గరగా ఉండటమే పార్టీకి ముఖ్యమని, అధికారపక్షమైనా, ప్రతిపక్షమైనా అది ఎప్పుడూ ప్రజలేనని లావు స్పష్టంచేశారు. జనం గురించి ఆలోచిస్తూ, వారికోసం పనిచేసేవారికే భవిష్యత్ ఉంటుందన్నారు. తాము తప్పులు చేసినా ఎవరైనా నిర్భయంగా తెలియచేయవచ్చని, భవిష్యత్ లో జరిగే స్థానిక సంస్థల ఎన్ని కల్లో కూటమిపార్టీల గెలుపుకోసం అందరూ ఐకమత్యంగా పనిచేయాలన్నారు.

**చిలకలూరిపేట డ్రైనేజ్ సమస్యను పరిష్కరిస్తాం... మున్సిపాలిటీ అవినీతిపై విజిలెన్స్ దర్యాప్తు జరిపించి అసలు దోషుల్ని శిక్షిస్తాం**

చిలకలూరిపేట నియోజకవర్గానికి సంబంధించి ప్రవేశపెట్టిన తీర్మానాలను పరిగణనలోకి తీసుకుంటున్నామన్న లావు, వర్షపునీరు రోడ్లపైకి రాకుండా త్వరలోనే పట్టణంలోని డ్రైన్లను పూర్తిస్థాయిలో ఆధునికరించబోతున్నామన్నారు. మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ దర్యాప్తు జరిపించి అసలు దోషుల్ని శిక్షిస్తామని కృష్ణదేవరాయలు స్పష్టంచేశారు. పసుమర్రు, గణపవరం, మానుకొం డవారి పాలెం పంచాయతీలను పేట మున్సిపాలిటీలో గత ప్రభుత్వం బలవంతంగా విలీనం చేసిందని, ఆ వ్యవహారం కోర్టులో నడుస్తోందని, ఆ వ్యవహారం ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. అలానే కొన్నిగ్రామాల్లోని పల్లెలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలనే వినతులు వచ్చాయని, వాటిపై మరలా ఆయా గ్రామాలు, గ్రామస్తులు నుంచి ప్రతిపాదనలు అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు లభించే సబ్సిడీ రుణాలను చిలకలూరిపేట యువత సద్వినియోగం చేసుకోవాలని, త్వరలోనే బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటుచేస్తామని లావు తెలిపారు. గ్రామాల్లోని సొసైటీల అభివృద్ధిపై గ్రామస్తులు దృష్టిపెట్టాలని, నాబార్డ్ నిధులతో ఎంతో అభివృద్ధి చేసుకోవచ్చిని, సొసైటీల సభ్యులు దానిపై దృష్టిపెట్టాలని ఎంపీ సూచించారు.

**పల్నాడు జిల్లా అభివృద్ధిపై ఎంతో సంతోషిస్తున్నా : కొమ్మాలపాటి శ్రీధర్ (పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు)**

చిలకలూరిపేట నియోజకవర్గస్థాయి మహానాడుకు టీడీపీ శ్రేణులు భారీసంఖ్యలో తరలిరావడం చూస్తే పార్టీకోసం ప్రాణమిచ్చే కార్యకర్తల ఉత్సాహం కనిపిస్తోందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎందరు మారినా టీడీపీ చేసే అభివృద్ధిలో ఎలాంటి మార్పు ఉండదన్నారు. చిలకలూరి పేట చుట్టూ జాతీయ రహదారుల రావడానికి ఎంపీ కృష్ణదేవరాయల కృషే కారణమని కొమ్మాలపాటి చెప్పారు. పల్నాడు జిల్లా అభివృద్ధిపై నాయకుడిగా కంటే కార్యకర్తగా ఎంతో సంతోషిస్తున్నానన్నారు. సంక్షేమ పథకాలకు ఆద్యుడు స్వర్గీయ ఎన్టీఆర్ అని, ఆయన ప్రవేశపెట్టిన పథకాలతో పేదల కన్నీళ్లు తొలగిపోయా యని కొమ్మాలపాటి తెలిపారు.

**మరలా అధికారంలోకి వస్తానని జగన్ కలలుగంటున్నాడు : చదలవాడ అరవిందబాబు (నరసరావుపేట శాసనసభ్యులు)**

గతంలో తన హాయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్ ఎంత దుర్మార్గంగా వ్యవహరించాడో ఆయనే ఆలోచించుకోవాలని నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు సూచించారు. కూటమిప్రభుత్వం స్థానిక సంస్థలో గెలుపుకోసం అక్రమాలు చేస్తోందని జగన్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎప్పటికీ అధికారంలోకి రాదని, జగన్ 2029లో అధికారంలోకి వస్తానని కలలుగంటున్నాడని అరవిందబాబు ఎద్దేవాచేశారు. మరలా వైసీపీకి ఓటు వేయాలంటే ప్రజలు భయపడేలా జగన్ పరిపాలన చేశాడన్నారు. గత ఎన్నికల్లో నరసరావుపేటలో టీడీపీ గెలవదని ప్రచారం చేశారని, కానీ కూటమిశ్రేణులు, ముఖ్యంగా ప్రత్తిపాటి పుల్లారావు, మంత్రి గొట్టిపాటి కృషితో మంచి విజయం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, వివిధ హెూదాలలో ఉన్న క్లస్టర్, యూనిట్, వార్డు, గ్రామ, బూత్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ బిల్లు.. పన్నుకు చిల్లు

కర్నూలు : కర్నూలు వ్యవసాయ మార్కెట్కు ఈ నెల 14న 52 క్వింటాళ్ల వరి ధాన్యం విక్రయానికొచ్చింది. క్వింటా మద్దతు ధర రూ. 2 వేలకు పైగా ఉండగా గరిష్ఠంగా రూ. 1,611 కనిష్ఠంగా రూ. 1,471 పలికింది. ధరలు పతనం కావడంతో వ్యాపారులు అన్నదాతల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. దొంగ బిల్లులతో మార్కెట్ ఫీజు (సెస్)కు ఎగనామం పెడుతున్నారు. తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది జేబులు నింపి సరిహద్దులు దాటిస్తున్నారు. కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు లేకపోవడంతో సిబ్బంది వసూళ్ల దుకాణం పెట్టారు.


**తక్కువ ధరకు కొనుగోలు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రబీలో 25,524 హెక్టార్లలో వరి సాగైంది. ఇందులో ఒక్క నంద్యాల జిల్లాలోనే 23,044 హెక్టార్లలో సాగు చేశారు. వరి ధాన్యం మద్దతు ధర ఏ-గ్రేడ్కు రూ. 2,320, సాధారణ రకానికి రూ. 2,300లుగా నిర్ణయించారు.

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు.. రైతులకు వ్యాపారులే దిక్కయ్యారు. దీన్ని ఆసరాగా తీసుకొని ధర అమాంతం తగ్గించారు. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు సరిహద్దు జిల్లాలకు తరలిస్తున్నారు. అక్కడ నేరుగా బియ్యం మిల్లులకు పంపించి క్వింటాపై రూ.వెయ్యి వరకు లాభం పొందుతున్నారు.

**అవుకు కేంద్రంగా దందా**

మార్కెటింగ్కు శాఖకు పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి ఉండటంతో నకిలీ బిల్లులతో రవాణా చేస్తున్నారు. వైఎస్సార్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ, కమలాపురం పేరుతో ఓ వ్యాపారి నకిలీ బిల్లులు సృష్టించి వరి ధాన్యాన్ని హైదరాబాదు, నెల్లూరు, కర్ణాటక



తరలించి వ్యాపారం చేసుకుంటున్నారు.

అవుకు మండలానికి చెందిన ఓ వ్యాపారి అవుకు, బనగానపల్లి, బేతంచెర్ల కేంద్రాల మీదుగా దాటేస్తున్నారు. ఇప్పటి వరకు 10 లారీలు నకిలీ బిల్లులతో తరలించినట్లు అధికారులు గుర్తించారు.

**సరిహద్దు దాటిస్తున్నారు**

రైతులే స్వయంగా ఇతర ప్రాంతాల్లో ధాన్యాన్ని విక్రయించడానికి తరలిస్తే మార్కెట్ కమిటీలకు ఎలాంటి ఫీజు చెల్లించనక్కర్లేదు. వ్యాపారులైతే రెండు శాతం ఫీజు చెల్లించాల్సి ఉంది.

ఉదాహరణకు ధాన్యం క్వింటా రూ. 2 వేల ధర ఉంటే ఒక లారీ 30 టన్నుల సామర్థ్యంతో రవాణా చేస్తారు. ఈ లెక్కన నిబంధనల ప్రకారం మార్కెట్ కమిటీకి 2 శాతం అంటే రూ. 12 వేలు ఫీజు చెల్లించి ఎక్కడికైనా తీసుకెళ్లి విక్రయించుకోవచ్చు.

పాణ్యం, నంద్యాల, శిరివెళ్ల, రుద్రవరం, బండిఆత్మకూరు, తుంగభద్ర తీర ప్రాంతం నుంచి వరి ధాన్యాన్ని కర్ణాటక రాష్ట్రంలోని సిరుగుప్ప, తెలంగాణలోని హైదరాబాద్, మిర్యాలగూడ, చెన్నై వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**తనిఖీలు తకరారు**

నంద్యాల జిల్లాలో 24, కర్నూలులో 12 వ్యవసాయ తనిఖీ (చెక్ పోస్టులు) కేంద్రాలు ఉన్నాయి. మార్కెటింగ్ శాఖ సూపర్వైజర్ స్థాయి అధికారులు విధులు నిర్వహించాలి. వారి స్థానంలో అవుట్సోర్సింగ్ ఉద్యోగులైన సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వహిస్తున్నారు. సెక్యూరిటీ గార్డులు, మార్కెట్ కమిటీ సిబ్బంది కలిసి వసూళ్లకు పాల్పడుతున్నారు. బిల్లు పుస్తకాలు వారి దగ్గరే ఉన్నా.. ఐదు లారీలు రవాణా చేస్తే.. ఒక లారీకి మార్కెట్ సెస్ వసూలు చేయడం.. డబ్బులు తీసుకొని మిగిలిన లారీలను పంపిస్తున్నారు. ఇలా ఒక్కో కేంద్రం వద్ద నిత్యం రూ. 3 వేల వరకు వసూలు చేస్తున్నారు.

గత రెండు నెలలుగా రాత్రి వేళల్లో నిత్యం 30-40 వరకు ధాన్యం లారీలు వెళ్తున్నాయి. ఎలాంటి ఫీజు చెల్లించకుండానే సరిహద్దులు దాటుతున్నాయి. ఎక్కువగా పాణ్యం, కర్నూలు తనిఖీ కేంద్రాల మీదుగానే వెళ్తున్నాయి. పాణ్యం వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్ పోస్టు నన్నూరు టోల్ ప్లాజా దగ్గర ఉంది. ఏ సమయానికి వస్తారో.. ఏ సమయానికి వెళ్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. బేతంచెర్ల చెక్ పోస్టులో నకిలీ బిల్లులలో వరి ధాన్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు తేలింది.

## చిన్నపాటి వర్షాలకు రహదారులపైకి మురుగు నీరు

### మున్సిపల్ అధికారుల పనితీరుపై ప్రజా ఆగ్రహం

### మురుగు తొలగించటంలో అలసత్వం ఎందుకు..

### ఉన్న సిబ్బందితో గ్యాంగ్ వర్క్ ద్వారా సమస్య పరిష్కరించవచ్చు కదా...



మాచర్ల లక్ష్యం ప్రతినిధి: మాచర్ల టౌన్లో చిన్న పాటి వర్షాలకు రహదారులపైకి వర్షపు నీరు, మురుగునీరు రావటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక పెద్ద వర్షం వస్తే మా పరిస్థితి ఏంటని ప్రజలు భయపడుతున్నారు. మున్సిపల్ అధికారుల పనితీరుపై ప్రజలు మండి పడుతున్నారు. కాలువల్లోని మురుగు తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో మున్సిపల్ అధికారులకు అలసత్వం ఎందుకు అని నిలదీస్తున్నారు. మాచర్ల పట్టణంలోని వివిధ వార్డులో, నెహ్రునగర్ ప్రధాన రహదారి పైకి చిన్న, చిన్న వర్షాలకు రహదాలుపైకి మురుగునీరు ప్రతి సారి వస్తుంటుంది. లక్షల రుపాయల ఆదాయం కోట్లకు పెరిగినా అవసరమైన సిబ్బంది ఉన్నా ఎందుకు తమకు ఈ దుస్థితి అంటు ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న సిబ్బందిని వార్డుల వారిగా విభజించటం వలన పనులు సక్రమంగా కావటం లేదని ప్రజలకు అవసరమైన సేవలు అందటం లేదని ప్రజా అభిప్రాయంగా ఉంది. ఉన్న సిబ్బందితో గ్యాంగ్ వర్క్ ద్వారా మురుగు కాలువల్లో అడుగు కనిపించేలా కాలువల్లో పూడిక తొలగిస్తే తమకు మేలు జరుగుతుందని ప్రజలు వాపోతున్నారు. అయితే పాలకవర్గం మాత్రం కాలవల్లో పూడిక తీసేందుకు కాకుండా , నూతన రహదారులు, మురుగు కాలవలను నిర్మిస్తే బాగుంటుందని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తుంది. నూతన రహదారులు, మురుగు కాలువలు ఏర్పాటు చేసినా తదుపరి కాలవల్లో సక్రమంగా పూడిక తీయించకపోతే తిరిగి పరిస్థితి ఇంతే కదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎం.ఎల్.ఏ జూలకంటి బ్రహ్మానందరెడ్డి జోక్యం చేసుకుని మురుగుకాలవల్లో పూర్తి స్థాయి పూడిక తీసేలా మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి వారికి తగిన ఆదేశాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

## క్రీడా పోటీల్లో మాచర్ల ప్రాంత వాసులు రాణించాలి

### వెయిట్ లిఫ్టర్ నీలంరాజుకు ఆర్థిక సహాయం

### ఎం.ఎల్.ఎ జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాచర్ల లక్ష్యం ప్రతినిధి: వేదిక స్వదేశమైనా, విదేశమైనా ఆయా ప్రాంతాల్లో జరిగే క్రీడా పోటీల్లో మాచర్ల ప్రాంత వాసులు దూసుకుపోవాలని నియోజకవర్గ క్రీడాకారులకు మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. మండల కేంద్రమైన వెల్దుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల ఎమ్మెల్యే హామీ ఇచ్చిన మేరకు జాతీయ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ కొమెర నీలంరాజుకు రూ1,61,200 నగదును అందజేశారు. అనంతరం క్రీడాకారులు వెయిట్ లిఫ్టర్స్ సాధించిన పతకాలను ఎమ్మెల్యేకు చూపించగా వారిని ఆయన అభినందించారు. ఈ ఏడాది జనవరి 31న ఉత్తరాఖండ్లో 67 కేజీల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో నీలంరాజు గోల్డ్ మెడల్ సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నీలంరాజును ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఘనంగా సన్మానించి, భవిష్యత్తు పోటీలకు ఏ అవసరం ఉన్న అన్ని విధాలుగా సహకరిస్తారని హామీ ఇచ్చారు. వెయిట్ లిఫ్టింగ్ ప్రాక్టీస్ చేసుకోవడానికి ఒలంపిక్ వెయిట్ లిఫ్టింగ్ బాల్ బేరింగ్ సెట్ను, లిఫ్టింగ్ వెయిట్స్ కావాలని ఎమ్మెల్యేను నీలంరాజు కోరడం జరిగింది. ఈ క్రమంలో ఇచ్చిన హామీ మేరకు నగదును జూలకంటి బ్రహ్మానందరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎం.ఎల్.ఏ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ జిల్లా, రాష్ట్రం, కేంద్ర స్థాయిలో జరిగే వివిధ పోటీల్లో పాల్గొని విజయం సాధించిన వారికి చదువులో ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుందని, వారు సాధించే పతకాల ఆధారంగా వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కూడ లభిస్తాయని వివరించారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్నవారు రాణిస్తే వారికి బహుళ ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ కోచ్ శివకేశవయాదవ్, హనుమాన్ జిమ్ నిర్వాహకులు ఆదివిష్ణుయాదవ్, వెయిట్ లిఫ్టర్స్ మంజుల అశోక్, కందుకూరి హేమావతి, అప్పల మల్లికార్జునరావు, రాకేష్రణధీర్యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# గుజ్జు పరిశ్రమల్లో కొనుగోళ్లు ప్రారంభం

చిత్తూరు : వేసవిలో అందరి దృష్టి మామిడి పైనే. మధుర ఫలానికి జిల్లా పెట్టింది పేరు. జిల్లాలో మామిడి వ్యాపారం మొదలైంది. చిత్తూరులోని యార్డుకు బేనీషా, కాదర్, పుల్లేర, తోతాపురి(బెంగళూర) లైన్ కాయలు చేరుకుంటున్నాయి. రాజస్థాన్, మహారాష్ట్ర, పంజాబ్, దిల్లీ తదితర రాష్ట్రాలకు చెందిన ఎగుమతిదారులు, వ్యాపారులు రెండ్రోజుల్లో చిత్తూరుకు చేరుకోనున్నారు. ఆవెంటనే ఇతర రాష్ట్రాలకు టేబుల్ రకాలు ఎగుమతి కానున్నాయి. ఆదివారం బేనీషా, కాదర్, పుల్లేరా, తోతాపురి లైన్ కాయలు చేరుకున్నాయని, నాలుగు రోజుల్లో వ్యాపారం జోరందుకోనున్నదని మండీల యజమానులు, వ్యాపారులు వెల్లడించారు.



**సహకరించని వాతావరణం**

జిల్లాలో ఆరు మామిడి గుజ్జు(పల్ప్) పరిశ్రమలు కార్యకలాపాలు ప్రారంభించాయి. చిత్తూరు, గుడిపాల, పూతలపట్టు ప్రాంతాల్లోని పరిశ్రమల్లో సందడి ప్రారంభమైంది. మామిడి కాయలను యార్డులు సహా ఆయా కంపెనీలకు రైతులు తరలిస్తున్నారు. మిగిలిన పరిశ్రమలు త్వరలో సీజన్‌ను ప్రారంభించనున్నాయి. గుజ్జు పరిశ్రమలు తోతాపురి కాయలను నెలాఖరు నుంచి కొనుగోలు చేపట్టనున్నట్లు సమాచారం. ఈ ఏడాది వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా దిగుబడులు తగ్గాయి. ఈ పంట సైతం పెనుగాలులతో కూడిన వర్షంతో కాయలు నేల రాలి రైతులు తీవ్రంగా నష్టపోయారు. తిరుపతి జిల్లాలోని పాకాల, దామలచెరువు, పుత్తూరు సహా చిత్తూరు, పెనుమూరు, బంగారుపాళ్యం, తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు తదితర ప్రాంతాల్లో కాయలు భారీగా నేల రాలాయి. కొన్నిచోట్ల ఏనుగులు మామిడి చెట్లు విరిచేశాయి. ఇలా అన్ని విధాలా మామిడి రైతుకు కన్నీళ్లు తప్పలేదు. మరోవైపున ఈ ఏడాది మామిడికి మంచి ధర లభిస్తుందని ఉద్యానశాఖ అధికారులు పేర్కొన్నారు.

# కాసులిస్తే 'కట్ట'దిట్టం

శ్రీశైలం : శ్రీశైలం ఆనకట్ట భద్రతకు నిధుల కొరత వెంటాడుతోంది. 15 ఏళ్ల కిందట వరద పోటెత్తడంతో కట్ట దిగువభాగం, అప్రోచ్‌రోడ్డు కోతకు గురయ్యాయి. మరమ్మతులకు అవసరమైన నిధుల కేటాయింపుపై ప్రభుత్వాలు దృష్టిపెట్టకపోవడం శాపంగా మారింది. సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణకు కేంద్రం అమలు చేస్తున్న డ్రిప్ పథకం కింద పైసా రాలేదు. ఒకట్రెండు రోజుల్లో పరిశీలనకు సెంట్రల్ వాటర్ కమిషన్ ప్రతినిధులు వస్తున్నట్లు ఇంజినీర్లు చెబుతున్నారు. వారిచ్చే నివేదికలతో అయినా ప్రభుత్వాల్లో కదలికొస్తేనే శ్రీశైలం జలాశయం భద్రతకు భరోసా లభిస్తుంది.

**పనికొచ్చే పనులకు పైసా ఇవ్వలే**

2009లో పోటెత్తిన వరదలకు ఆనకట్ట కుడివైపు కొండచరియలు, అప్రోచ్‌రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయాయి. ఆనకట్ట స్పిల్‌వే ఎదురుగా ఉన్న ఏప్రాన్ ముందు దృఢమైన బండపరుపు కొంతవరకు కొట్టుకుపోయింది. వీటిని పునరుద్ధరించాలని అప్పట్లోనే నిపుణులు సూచనలు చేసినా పట్టించుకోలేదు. ః కుడిగట్టు కొండ చరియలకు (ఆనకట్టకు పక్కన) ఆనుకొని ఉన్న అప్రోచ్ రోడ్డు వరదలకు కొట్టుకుపోయింది. పునరుద్ధరణకు ఇంతవరకు చిల్లిగవ్వ విడుదల చేయలేదు. ః అప్రోచ్ రోడ్డు పునరుద్ధరణ జరిగితేనే మరమ్మతులకు అవసరమైన వస్తువులు, యంత్ర సామగ్రిని ఏప్రాన్ వద్దకు తీసుకెళ్లేందుకు ఆస్కారం ఉంటుంది.

**రూ.100 కోట్లు అవసరం**

2009 వరదలకు తీవ్రస్థాయిలో దెబ్బతిన్న శ్రీశైలం ఆనకట్ట భద్రత, పునరుద్ధరణ కోసం రూ.100 కోట్లయినా అవసరం అవుతుంది. కుడిగట్టు వైపు అప్రోచ్ రోడ్డు పునరుద్ధరణకే రూ.43.60 కోట్లు అవసరమని ఇంజినీర్లు మూడేళ్ల కిందటే ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



ఆనకట్ట దిగువన ఏప్రాన్ బలోపేతం, విస్తరణ కోసం మరో రూ.41.30 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. స్పిల్‌వే రక్షణ, కుడి, ఎడమ వైపు కొండ చరియలను సరిచేయడానికి నిధులు అవసరమని కోరారు.

**డ్రిప్.. ఉఫ్**

దేశంలోని అన్ని ఆనకట్టల భద్రత కోసం కేంద్ర జల వనరుల శాఖ 2020లో ఆనకట్టల పునరుద్ధరణ, మెరుగుదల ప్రాజెక్టు (డ్రిప్) పథకాన్ని అమలు చేసింది. శ్రీశైలం ఆనకట్టకు ఇచ్చేందుకు సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) ఆమోదం తెలిపింది.

ప్రపంచ బ్యాంకు నిధులొస్తాయని 2020లో రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ కింద అకౌంట్ ఏర్పాటుకు సిద్ధమైంది. సీడబ్ల్యూసీ మాజీ ఛైర్మన్ ఏబీ పాండ్య ఆధ్వర్యంలో ఏర్పాటైన జాతీయ నిపుణుల కమిటీ ప్రతినిధులు 2021, 2022లో రెండుసార్లు శ్రీశైలం ఆనకట్టను సందర్శించి నివేదికలు సిద్ధం చేశారు. వాటి ప్రకారం ఆనకట్ట ఇంజినీర్లు ప్రతిపాదనలు సమర్పించారు. ఇంతవరకు డ్రిప్ నిధుల ఊసే లేకుండాపోయింది.

# పర్యావరణ హితం.. ఉపాధికి ఊతం



అనంతపురం : నగర, పట్టణాల్లో పర్యావరణ పరిరక్షణకు అడుగులు పడుతున్నాయి. స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాలకు స్వయం ఉపాధికి ఊతమిస్తూనే పర్యావరణ హితానికి నాంది పలుకుతున్నారు. ఇంధన రహిత వాహనాలతో ఉపాధికి ఊతమిస్తున్నారు. ఆ వివరాలేంటో తెలుసుకుందాం.

ప్రస్తుతం ఎలక్ట్రిక్ ఆటోలు, ద్విచక్ర వాహనాలను బ్యాంకు ద్వారా కంతుల వారీగా చెల్లించే విధానానికి శ్రీకారం చుట్టారు. నగరం, పట్టణాల్లోనే ఎక్కువగా డిమాండ్ ఉండటంతో జనాభా ప్రాతిపదికన లక్ష్యం నిర్దేశించారు. మహిళలు, వారి కుటుంబ సభ్యులను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో ర్యాపిడో సంస్థతో సీఎం చంద్రబాబు, మెప్మా మిషన్ డైరెక్టరు తేజ్ భరత్ సమక్షంలో ఇటీవల అవగాహన ఒప్పందం చేసుకున్నారు. వారికి మాత్రమే కొన్ని ప్రత్యేక మినహాయింపులు, రాయితీలు కల్పించారు.

సొంతంగా ఆటోలు, ద్విచక్రవాహనం నడపడం కంటే ఇలా సంస్థకు అనుసంధానంగా ఉంటే సుస్థిరమైన, స్థిరమైన ఉపాధి పొందుతారనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో అర్హులైన వారిని ఎంపిక చేసే బాధ్యతను అనంతపురం నగరంతోపాటు ఇతర పట్టణాల్లో మెప్మా విభాగం సిబ్బందికి అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటికే గుంతకల్లులో ఒక లబ్ధిదారు ఆటో పొంది ఉపాధి పొందుతున్నారు.

**ప్రయోజనం ఇలా..**

మూడు నెలల పాటు ర్యాపిడో మొబైల్ అప్లికేషన్స్ ఛార్జీలు రూ.3 వేలు మాఫీ చేశారు. ద్విచక్రవాహనం, ఆటో ద్వారా రోజుకు 9 గంటలు లాగిన్‌తో ర్యాపిడో ఫ్లాట్‌ఫాం వాడుకొని 300 రైడ్ అభ్యర్థనల్లో కనీసం 150 అభ్యర్థనలు పూర్తి చేస్తే నెలకు రూ.1,000 నెలవారీ ఈఎంఐ మద్దతు అందిస్తారు.

రుణం మొత్తం చెల్లించేలోపు ద్విచక్రవాహనం అయితే రూ. 27వేలు, ఆటోకు రూ.50 వేల వరకు ప్రయోజనం ఒనగూరుతుంది.

బ్యాంకు రుణం మహిళల పేరుతో ఇస్తారు. బీ సదరు మహిళకు డ్రైవింగ్ లైసెన్సు లేకుంటే కుటుంబంలో డ్రైవింగ్ లైసెన్సు ఎవరికైనా ఉంటే బ్యాంకు ద్వారా రుణం పొందొచ్చు.

ద్విచక్రవాహనం రూ.1.21 లక్షలు రూ.1.23 లక్షలు, ఆటో రూ.3.35 లక్షలు, రూ.3.60 లక్షల మోడల్‌ను ఎంపిక చేసుకోవచ్చు.

బ్యాంకు రుణాన్ని నెలకోసారి చొప్పున ద్విచక్ర వాహనానికి 3 నుంచి 5 సంవత్సరాలు, ఆటోకు 5 నుంచి 7 సంవత్సరాల్లో చెల్లించవచ్చు.

రోజుకు ద్విచక్ర వాహనంతో 100 కిలోమీటర్లు చొప్పున నెలకు రూ.14,600, ఆటో ద్వారా రోజుకు 130 కిలోమీటర్లు చొప్పున నెలకు రూ.17 వేలు వరకు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చితే ఉపాధి పొందవచ్చు. ఇంకా ఎక్కువ సమయం, కిలోమీటర్లు వెళితే ఆ మేరకు ఉపాధి పొందొచ్చు.

# 517 చెరువులు.. 5.609 టీఎంసీలు



అనంతపురం : మూడు నెలలుగా భానుడి ఉగ్రరూపంతో విలవిల్లాడిన ఉమ్మడి అనంత జిల్లాలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. వరుణుడు ముందస్తుగా కరుణించడంతో చల్లని గాలులు వీస్తున్నాయి. వారం పది రోజుల్లో రుతు పవనాలు జిల్లాలో ప్రవేశిస్తాయని ఇప్పటికే వాతావరణశాఖ ప్రకటించింది. ఆ లోపే అకాల వర్షాలు కురవడంతో ప్రజలు సంతోషం వ్యక్తపరుస్తున్నారు. అనేక ప్రాంతాల్లో మూడు రోజులుగా కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పారుతున్నాయి. చెరువులకు కొత్త నీరు చేరుతుండటంతో 'జలకళ'లాడుతున్నాయి. ఎగువన కర్ణాటకలోనూ అకాల వర్షాలొస్తున్నాయి. ఆ నీరు సైతం దిగువన ఉమ్మడి అనంత జిల్లాలోకి ప్రవేశిస్తోంది. దీంతో ఎక్కడికక్కడ చెరువుల్లోకి నీరు వేగంగా చేరుతోంది.

**1.23 లక్షల ఎకరాల ఆయకట్టు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,484 చెరువుల కింద 1,22,529 ఎకరాల ఆయకట్టు ఉంది. అనంత జిల్లాతో పోల్చితే శ్రీసత్యసాయి జిల్లాలోనే అత్యధికంగా చెరువులు ఉన్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రెండు జిల్లాల్లోనూ 49 చెరువులు పూర్తిగా నిండి మరువ పారుతున్నాయి. మరో 30 చెరువుల్లోకి 75 శాతం మేర నీరు చేరాయి. 66 చెరువులు యాభై శాతం నిండాయి. ఇరవై ఐదు శాతం నిండిన చెరువులు 372 ఉండగా.. అసలు చుక్కనీరు చేరని చెరువులు 967 ఉండటం విశేషం. ఉమ్మడి జిల్లాలో మొత్తం 517 చెరువుల్లో 5.609 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నీటి ఎద్దడితో సతమతం అవుతున్న తరుణంలో వాన నీరు చెరువుల్లో నిల్వ ఉండటంతో భూగర్భ నీటిమట్టం పెరుగుతోంది. అనంత జిల్లాలో నీటి మట్టం సగటున 11.15 మీటర్లకు చేరింది. శ్రీసత్యసాయి జిల్లాలో 13.67 మీటర్లలో ఉంది. ఇక అనంత జిల్లాలో ఏప్రిల్‌లో 11.9 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 64.95 మి.మీ. నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లాలో 13.26 మి.మీ.కిగాను 40.71, ప్రస్తుత నెల్లో 15.51 మి.మీ.కి 69.84 మి.మీ. కురిసింది. రెండు జిల్లాల్లోనూ భూగర్భ నీటిమట్టం కొద్దిమేర పెరిగింది.

**అనంతలో ఎక్కువ..**

ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా చూస్తే ఎక్కువగా అనంత జిల్లాలోనే వాన పడింది. వంద శాతం నిండిన చెరువులు 35 ఉంటే.. శ్రీసత్యసాయి జిల్లాలో 14 ఉన్నాయి. అనంత జిల్లా పరిధిలో అనంతపురం, ఆత్మకూరు, పెద్దవడుగూరు, రాప్తాడు, తాడిపత్రి, ఉరవకొండ, యాడికిలో ఒక్కొక్క చెరువు, విడపనకల్లు, బెళుగుప్పలో రెండ్రెండు, గుత్తిలో నాలుగు, పామిడిలో ఆరు, గుంతకల్లు, వజ్రకరూరులో ఏడు చెరువుల ప్రకారం నిండాయి. శ్రీసత్యసాయి జిల్లాలో తనకల్లు, ముదిగుబ్బ, కొత్తచెరువులో ఒక్కొక్క చెరువు, ధర్మవరంలో ఐదు, నల్లచెరువులో ఆరు చెరువులు భర్తీ అయినట్లు ఆన్‌లైన్ నివేదిక చెబుతోంది.

# అక్రమాలు నిగ్గు తేల్చండి




చిత్తూరు : జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు వద్ద సీసీగా బాధ్యతలు నిర్వర్తించిన సురేంద్రరెడ్డి అక్రమాలపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.. వైకాపా హయాంలో అన్నీ తానై వ్యవహరించి ఉద్యోగులను ఇబ్బంది పెట్టిన నేపథ్యంలో ఆయనపై అప్పట్లోనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టి నిజాలు నిగ్గు తేల్చాలని విశ్రాంత ఎంపీడీవో కనకరాజుల నాయుడు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహా పీఆర్ కమిషనర్ కృష్ణతేజకు ఫిర్యాదు చేశారు. దీంతో అతడిపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సారథ్యంలో జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు రంగంలోకి దిగి విచారణ చేపట్టనున్నారు. సురేంద్రరెడ్డి ప్రస్తుతం జీడీనెల్లూరులో ఏవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. జడ్పీలో అన్నీ తానై వ్యవహరించి ప్రశ్నించిన ఉద్యోగులను సస్పెండ్ చేయించడం.. జిల్లాలో దూరప్రాంతాలకు బదిలీ చేయడంలో కీలకపాత్ర పోషించాడు. ఆరోపణలు వచ్చిన, బదిలీ అయిన, సస్పెండ్ అయిన తదితర కారణాలను ఎదుర్కొంటున్న ఉద్యోగులకు సంబంధించి 300 పైగా దస్త్రాలు కనిపించకపోవడం, కొందరు ఉద్యోగుల ఎస్‌ఆర్‌లు తదితర ముఖ్యమైన దస్త్రాలు మాయమవడం వెనుక అతడి హస్తం ఉందని నాటి సీఈవో గ్లోరియా విచారణలో తేలడంతో అతడిని ఇక్కడి నుంచి పంపేశారు. జడ్పీ కార్యాలయంలో ఏవోలు, సిబ్బంది ఆయా విభాగాల్లో ఏమి చేస్తున్నారు, వారితో ఎవరు మాట్లాడుతున్నారని తెలుసుకునేందుకు ప్రతి సెక్షన్‌లో, ఆవరణంలో 36 నిఘా నేత్రాలు ఏర్పాటు చేశారు. జీడీనెల్లూరు వెళ్లినా తన మొబైల్‌లో సీసీ కెమెరాల ఫుటేజీ అనుసంధానం చేసుకుని పర్యవేక్షిస్తూ అడ్డంగా దొరికిపోవడంతో అతడిపై తీవ్ర చర్యలకు ఉపక్రమించారు. సస్పెన్షన్ వరకు వెళ్లడంతో హుటాహుటిన వాటిని తొలగించాడు. ఆపై జరిగిన విచారణలో అతడు దాచిపెట్టిన 300 పైగా దస్త్రాలు, ఎస్‌ఆర్‌లు తిరిగి అప్పగించడంతో అందరూ నివ్వెరపోయారు.

**మళ్లీ వచ్చేందుకు యత్నం..?**

జడ్పీ కార్యాలయం నుంచి వెళ్లిపోయిన అతడు మరోసారి అదే పోస్టులో పనిచేయాలని ప్రయత్నించగా కొందరు అడ్డుకున్నారని సమాచారం. సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందేందుకు సీనియారిటీ జాబితాలో ఉన్నాడు. అతడు ఎక్కడ పనిచేసినా అక్కడ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, గుత్తేదారులతో ఘర్షణ పడేవాడని సమాచారం. అతడిపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని పీఆర్ కమిషనర్ కృష్ణతేజ తాజాగా ఆదేశించడంతో నాటి వైకాపా హయాంలో జడ్పీలో ఇంకెన్ని అక్రమాలు వెలుగు చూస్తాయనేది వేచిచూడాల్సిందే.

# పెన్నాలో పంటల సాగు

తాడిపత్రి : గత వైకాపా ప్రభుత్వంలో పెన్నానదిలో భారీగా ఆక్రమణలు జరిగాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకుని పలువురు నదిని ఆక్రమించి హద్దులు వేసి ఇసుకను అమ్ముకుని లక్షలు గడించారు. ఈకోవలోనే నది ఆక్రమించి పలు రకాల పంటలు సాగు చేస్తున్నారు. అధికారులకు తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తాడిపత్రి నియోజకవర్గంలో తాడిపత్రి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల్లో సుమారు 64 కి.మీ.ల మేర పెన్నానది ప్రవహిస్తోంది. తాడిపత్రిలో 24 కి.మీ.లు కిలోమీటర్ వెడెల్పులో నది విస్తరించి ఉంది. కొన్నాళ్లుగా ఆక్రమణలు జరగడంతో ప్రస్తుతం నది వంద మీటర్లు కూడా లేని పరిస్థితి ఉంది. తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నె, నందలపాడు, చిన్నపొలమడ గ్రామాల్లో భారీగా పంటలను సాగు చేశారు. ప్రధానంగా మామిడి, సపోటా, వరి, అల్లనేరేడు తదితర పంటలను సుమారు ఏడు వందల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వాస్తవానికి మూడు మండలాలకు సంబంధించి వెయ్యి ఎకరాలకు పైగానే ఉంటుందని ఆయా మండలాల ప్రజలు ఆరోపిస్తున్నారు. వీటిని ఏళ్ల తరబడి ఇటు నాయకులు, అటు అధికారులు చూస్తున్నా ఎటువంటి చర్యలు లేవని వారు వాపోయారు.



మరోవైపు ఇసుక మాఫియా కూడా చెలరేగిపోతోంది. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా నదిలో తవ్వకాలు చేపడుతున్నారు. ఒక వైపు నదిలో తవ్వకాలు, మరో వైపు పంటల సాగుతో నది ఉనికి కోల్పోతోంది. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

**నోటీసులు అందించాం**

రజాక్‌వలి, తహసీల్దార్, తాడిపత్రి

తాడిపత్రి పరివాహక ప్రాంతంలో పెన్నానది ఆక్రమించిన విషయం తెలిసిందే. దీనిపై లోకాయుక్తా కూడా చర్యలు తీసుకోవాలని గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా తాము కూడా నదిని ఆక్రమించి సాగు చేస్తున్న వారు, ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. నదిలోని ఆక్రమణలను అరికట్టి వాటిని పరిరక్షించేందుకు తగు చర్యలు తీసుకుంటాం.

# చేతులు కలిపారు.. కొండను కరిగించారు

రేణిగుంట : రహదారికి మట్టి అమ్మకాల పేరిట కొండలనే మాయం చేస్తున్నారు అక్రమార్కులు. గతంలో వైకాపా నేతలు అక్రమంగా తవ్వకాలు జరిపి అమ్మకాలు చేపడితే ఇప్పుడు అదే వర్గంతో చేతులు కలిపారు స్థానిక నేతలు. రేణిగుంట మండలం కరకంబాడి కేంద్రంగా పెద్దఎత్తున దందా జరుగుతున్నా యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కరకంబాడి సమీపంలోని మల్లెమడుగు వెనక శేషాచల కొండలున్నాయి. స్థానికంగా జాతీయ రహదారుల పనులు ఊపందుకోవడంతో 2022 నుంచి వైకాపా నేతలు పెద్దఎత్తున తవ్వకాలు చేపట్టి మట్టి విక్రయించారు. కొద్దికాలంగా స్థానిక నేతలు కొండపై పెత్తనం తీసుకున్నారు. ఇందులో అప్పటికే బలంగా పాతుకుపోయిన వైకాపా నేతలతో కలిసి దందా కొనసాగించాలని నిశ్చయించారు. ఏకంగా కొండనే కనుమరుగు చేసేశారు. గతంలో స్థానిక రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన కందకాలను సైతం పూడ్చివేసి పనులు సాగిస్తున్నారు. ముఖ్యంగా



రోడ్డుపై టిప్పర్ల హల్‌చల్‌తో ప్రజలు హడలిపోతున్నారు. స్థానిక దారులు ధ్వంసమవుతున్నాయి. వాటి అతివేగంతో ప్రజల ప్రాణాలు గాల్లో దీపంలా మారాయి.

**తెరవెనుక ఆ ఇద్దరు...**

మట్టి తవ్వకాల వెనుక నియోజకవర్గ నేతకు చెందిన ఇద్దరు అనుచరులు ఉన్నట్లు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఏఅధికారులూ ఇటువైపు రాకుండా సామదాన దండోపాయాలు ఉపయోగిస్తున్నారు. మట్టి తరలింపుపై సంబంధిత అధికారులను వివరణ కోరగా తవ్వకాల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు బదులిచ్చారు.

**నెలకు రూ.1.80 కోట్ల అక్రమ సంపాదన**

రోజూ రాత్రివేళల్లో పెద్దఎత్తున టిప్పర్లలో మట్టి తరలిస్తున్నారు. దీంతో ఒకప్పుడు కొండ ఉండగా ఇప్పుడు అక్కడ లోయలు కనిపించేలా ఆ ప్రాంతం తయారైంది. టిప్పర్‌కు రూ.10 వేలకు పైగానే వసూలు చేస్తుండగా సగటున రోజుకు సుమారు రూ.6 లక్షలు నెలకు రూ.1.80 కోట్ల వరకు అక్రమంగా సంపాదిస్తున్నట్లు అంచనా.

# తీపి తక్కువ.. పోషకాలెక్కువ

ఆళ్లగడ్డ: బాల్యం బక్కచిక్కుతోంది..పోషకాహార లేమితో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో చిన్నారుల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పంపిణీ చేసే ఆహారం ఆరోగ్యకరంగా, బలవర్ధకంగా ఉండేలా చర్యలు చేపట్టింది. వచ్చే నెల నుంచి అమల్లోకి తీసుకురానున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 3,558 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో 6 నెలల నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులు 2,71,588 మంది వరకు ఉన్నారు. వీరిలో 3-6 ఏళ్ల చిన్నారులకు అల్పాహారంగా ఉడికించిన కోడిగుడ్డు, 100 ఎం.ఎల్. పాలు, మధ్యాహ్నం పప్పుతో కూడిన భోజనం అందిస్తున్నారు. మూడేళ్లలోపు చిన్నారులకు బాలామృతం ప్యాకెట్లు ఇస్తున్నారు.

ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరు నుంచి మూడేళ్ల పిల్లలను ఒకే సమూహంగా పరిగణించేవారు. ప్రస్తుతం వారిని 6 నుంచి 12 నెలలు, 12 నెలల నుంచి మూడేళ్ల చిన్నారులుగా రెండుగా విభజించారు.

3 నుంచి 6 ఏళ్ల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో వారంలో రెండు మార్లు ఎగ్‌ఫ్రైడ్ రైస్ అందించనున్నారు. ఉదయం ఉడికించిన శనగలు ఇవ్వనున్నారు. మూడేళ్లలోపు చిన్నారులకు అందించే బాలామృతంలో తీపి శాతాన్ని తొలగించనున్నారు. ఈ మార్పును అమలు చేసే కార్యక్రమంలో భాగంగా మొదట ప్రతి జిల్లాకు ఓ కేంద్రాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బి.క్యాంప్ ప్రాజెక్టులోని ఒక కేంద్రాన్ని ఎంపిక చేశారు.

# వారు తవ్వేస్తున్నారు.. వీరు వదిలేస్తున్నారు

శంకరపట్నం: గ్రామాల్లోని చెరువులు, కుంటలు, గుట్టలు, ప్రభుత్వభూముల్లో అక్రమ తవ్వకాలు జరిపి మట్టి రవాణా చేస్తున్నా.. నియంత్రించే అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఈ దందాను అడ్డుకునే వారు కరవయ్యారు. మానకొండూర్ పరిధి శంకరపట్నం మండలంలోని కాచాపూర్, కల్వల, గద్దపాక, అర్కండ్ల, కేశవపట్నం, తాడికల్ గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో పొక్లెయిన్ యంత్రాలతో తవ్వకాలు చేస్తూ మట్టి రవాణా సాగిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఈ దందా సాగుతున్నా.. అధికారులు చూసి చూడనట్టు ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినాలు వస్తే చాలు తెల్లవారుజామునే పొక్లెయిన్ యంత్రాలు, ట్రాక్టర్లు దర్శనమిస్తున్నాయి.



**గుట్టలను సైతం వదలట్లేదు**

ఈనెల 17న గద్దపాక, కల్వల గ్రామాల్లోని చెరువుల్లో మట్టి తవ్వకాలను రెవెన్యూ అధికారులు పరిశీలించి హెచ్చరికలు చేశారు. అయినప్పటికి ఆదివారం కాచాపూర్ చెరువులో కొందరు ట్రాక్టర్లలో రవాణా సాగించారు. రైతుల వ్యవసాయ పొలాల్లోకి, గ్రామాల్లోని ఇళ్ల నిర్మాణాల పేరిట డబ్బులు దండుకొంటున్నారు. స్థానిక గ్రామాలతో పాటు కల్వల, కాచాపూర్ గ్రామాల్లోని చెరువుల నుంచి ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.వెయ్యి దాకా వసూలు చేస్తున్నారు. గ్రామాల్లోని గుట్టల ప్రాంతంలో సైతం మట్టి తవ్వకాల తరలింపుతో నగదు దండుకొంటున్నా అధికారులు నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామస్థులు మండిపడుతున్నారు.

**కేసులు నమోదు చేస్తాం**

సమాచారం అందగానే వెళ్లి పరిశీలిస్తే అక్కడ వాహనాలు కనిపించలేదు. చెరువులు, కుంటల్లో అక్రమ మట్టి తవ్వకాలు చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం. మట్టి రవాణాకు వినియోగించే వాహన యజమానులకు జరిమానా విధిస్తాం. కవిత, డీఈఈ

# సర్వే సాగక.. కర్షకుల కలత తీరక

సిరిసిల్ల: సర్వేయర్ల కొరత కారణంగా జిల్లాలో భూ కొలతల సమస్య రైతులను వేధిస్తోంది. రెండు రెవెన్యూ డివిజన్లకు 15 మంది సర్వేయర్లు ఉండాల్సి ఉండగా.. 8 ఖాళీలు ఉన్నాయి. ఖాళీలున్న చోట పక్క మండలాల వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ అధికారులు రహదారులు, రైల్వే, ప్రాజెక్టులు తదితర అభివృద్ధి పనుల బాధ్యతలు చూస్తున్నారు. ఏళ్ల తరబడి వీటికే ప్రాధాన్యత ఇవ్వడంతో రైతుల భూముల సర్వేలో జాప్యం జరుగుతోంది.

భూ వివాదాలకు అవకాశం లేకుండా, కొత్త చట్టంలో రీసర్వే నిబంధనలు అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో పోస్టుల మంజూరు, ఖాళీల భర్తీతోపాటు, అధునాతన పరికరాలు కేటాయించి, సర్వేశాఖను పూర్తిస్థాయి సామర్థ్యంతో సేవలందించే విధంగా సన్నద్ధం చేయాల్సిన అవసరముంది.

భూ భారతి చట్టం అమలులో భాగంగా అర్హులైన సర్వేయర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఈనెల 17 వరకు దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో శిక్షణకు 163 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎంపికైనవారికి ఈనెల 26 నుంచి జులై 26 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. కాగా ఇప్పటికే జిల్లాలో 19 మంది లైసెన్సుడు సర్వేయర్లు ఉన్నారు.

జిల్లా వివరాలు



సర్వేకు వచ్చిన దరఖాస్తులు: 12,581
అనుమతి పొందినవి : 7069
తిరస్కరించినవి : 4934
పెండింగ్‌లో ఉన్నవి : 578

బదిలీ కాని దస్త్రాలు

దీనికితోడు జిల్లా ఆవిర్భావం తర్వాత చాలా వరకు దస్త్రాలు బదిలీ కాలేదు. అలాగే అటవీ, రెవెన్యూ భూముల వివాదాలు చాలా వరకు అపరిష్కృతంగా ఉన్నాయి. ప్రభుత్వం భూ భారతి చట్టం అమలులో రైతుల భూములకు హద్దులు పక్కగా ఉండాలని నిర్ణయించడంతో.. సర్వేయర్ల ఆవశ్యకత పెరిగింది. ఈ విభాగాన్ని పటిష్ఠం చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే ఉన్న లైసెన్సుడ్ సర్వేయర్లకు అనుమతులు ఇస్తూనే.. కొత్తవారికి శిక్షణనిచ్చేలా ప్రణాళికలు చేస్తోంది.

**నక్షా ఆధారంగా రిజిస్ట్రేషన్లు**

నిజాం కాలంలో షెత్వార్ పేరిట భూముల సర్వే జరిగింది. రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పట్టాభూముల వివరాలతో కాస్రా-పహాణి తయారు చేశారు. అప్పటినుంచి వాటినే రెవెన్యూశాఖ పరిగణనలోకి తీసుకుంటుంది. రెవెన్యూ సర్వేలాండ్ రికార్డులోని టీపన్(కొలతల పుస్తకం) ఆధారంగా కొలతలు చేపడుతున్నారు. దీని ద్వారా హద్దులు నిర్ణయిస్తున్నారు. వీటిలో స్పష్టతలేక తరచూ భూముల వివాదాలు నెలకొంటున్నాయి. వీటికి శాశ్వత పరిష్కారం దిశగా నక్షా ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేయాలని ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంలో పేర్కొంది.

**ఏడాదిగా పరిష్కారం కాలేదు**

సర్వే దరఖాస్తు పత్రంతో విజయ్, మర్తన్‌పేట

గ్రామంలో మాకు పలు సర్వే నంబర్లలో 11.10 ఎకరాల భూమి ఉంది. పక్కవారితో హద్దుల సమస్య రావడంతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీని కోసం గతేడాది మేలో సర్వే కోసం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసి ఏడాదవుతున్నా.. సమస్య పరిష్కారం కాలేదు.

# అన్నీ మృత్యు కుహరాలే



హైదరాబాద్ : చార్మినార్‌కు అతి సమీపంలోని కృష్ణా ముత్యాల దుకాణంలో అగ్ని ప్రమాదం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. తక్కువ వెడల్పుతో మెట్లు, ఒకే గుమ్మం, చుట్టూ గాలి కూడా దూరలేని విధంగా నిర్మాణాలు, ఏళ్ల నాటి విద్యుత్తు తీగలతో పనిచేస్తోన్న వ్యాపార కేంద్రాలు ఎంత వరకు శ్రేయస్కరం అని జనాల్లో ఆందోళన మొదలైంది. కింది అంతస్తులో చెలరేగిన మంటలు నిమిషాల వ్యవధిలో పై అంతస్తులో వారిని బలి తీసుకున్నాయి. దట్టమైన పొగ ఇంటి నిండా వ్యాపించడంతో ఊపిరి పీల్చుకోలేక 17 మంది చనిపోయారు. రెండేళ్ల కిందట సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లోనూ అదే జరిగింది. ఈ నేపథ్యంలో చార్మినార్ చుట్టుపక్కల ఉన్న వెయ్యికిపైగా పురాతన కట్టడాల్లో నిర్వహిస్తున్న దుకాణాల భద్రతపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

**రద్దీ మార్కెట్లే..** అఫ్జల్‌గంజ్, బేగంబజార్ నుంచి మొదలుపెడితే మూసీకి అటువైపున ఉన్న మదీనా మార్కెట్, పత్తర్‌గట్టీ, లాడ్‌బజార్, దాని చుట్టుపక్కలున్న వేర్వేరు మార్కెట్లలో వందేళ్లకు పైబడిన భవనాలు వెయ్యికిపైగా ఉన్నట్టు జీహెచ్‌ఎంసీ చెబుతోంది. దుకాణాలన్నీ ఒకదానికొకటి ఆనుకొని ఉండటంతో మంటలు సులువుగా వ్యాపించే ప్రమాదం పొంచి ఉంది.

**నగరంలో 70వేలు**

ప్రమాదం జరిగిన భవన విస్తీర్ణం 77 గజాలు. రెండు ముత్యాల దుకాణాలు, పై అంతస్తుల్లో ఇళ్లున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు లోపలున్న బాధితులు మెట్ల మార్గం నుంచి బయటకు రాలేకపోయారు. నగరంలో 19లక్షల నిర్మాణాలు ఆస్తిపన్ను పరిధిలో ఉండగా, ఇళ్లతోపాటు వ్యాపార కేంద్రాలు కలిసి ఉన్నవి 70వేలు. వాటన్నింటినీ తనిఖీ చేసి, అగ్ని ప్రమాద నివారణ చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలను అరికట్టవచ్చని అధికారులు చెబుతున్నారు.

**భద్రత కోసం నిర్మించిన భవనమే కారణమా?**

గుల్జార్‌హౌజ్ వద్ద దొంగతనాలకు అవకాశం లేకుండా భవనాలను నిర్మించడమే ప్రమాద తీవ్రతకు కారణమైందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గాలి దూరకుండా, కిటికీలు, షట్టర్లు నిర్మించడంతో ప్రమాదంలో తప్పించుకునే వీలు లేకుండా చేసింది. గుల్జార్‌హౌజ్‌లో ముత్యాల వ్యాపారం జరిగే ప్రతి భవనమూ ఇదే తరహాలో నిర్మించారు. ఆదివారం సహాయక చర్యలు చేపట్టడానికి తొలుత వెనకాడాల్సి వచ్చిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# ఘాట్‌లో విహరిస్తూ.. భక్తితో తరిస్తూ!



మహబూబాబాద్: భక్తిభావంతో నిండిన పుష్కర ఘాట్.. ఆధ్యాత్మికతతో విరాజిల్లుతున్న నదీతీరం.. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తుల సందడి.. కేవలం పుష్కర స్నానమే కాకుండా.. పడవలో ప్రయాణిస్తూ.. హెలికాప్టర్‌లో విహంగ వీక్షణం చేస్తూ.. ఎద్దులబండిపై ప్రయాణిస్తూ.. స్వామి సన్నిధిలో తరిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాల్లో విశేషాలిలా.. ఎద్దులబండి ప్రయాణం దూర ప్రాంతాల నుంచి ప్రైవేటు, సొంత వాహనాల్లో వస్తున్న జనం.. పార్కింగ్ ప్రాంతాల నుంచి సరదాగా ఎద్దులబండి ఎక్కి ప్రయాణం చేస్తున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకుటూ.. ఫొటోలు తీసుకుంటూ.. ఆనంద పడుతున్నారు. బండ్ల యజమానులకు ఒక్కొక్కరు రూ.50 చెల్లిస్తున్నారు.

**కాళేశ్వర, ముక్తీశ్వరుడికి మొక్కులు..**

పుష్కర స్నానం, ఇతరత్రా పూజాది కార్యక్రమాలు, నదిలో, ఒడ్డున ఆనంద జ్ఞాపకాల మదిలో తేలియాడిన వారందరూ శ్రీ కాళేశ్వర, ముక్తీశ్వరుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించి ఇళ్లకు తిరుగు పయనమవుతున్నారు.

**సరదాగా పడవలో..**

పుష్కర జ్ఞాపకం మధురానుభూతిగా మిగలాలనే ఆసక్తితో చాలా మంది పడవలో ప్రయాణిస్తూ కేరింతలు కొడుతున్నారు. ఒక్కొక్కరు రూ.100 చెల్లించి దాదాపు నదిలో 2 కి.మీ పొడవునా ప్రయాణిస్తున్నారు. సుమారు 6 పడవల్లో రోజుకు వెయ్యి మంది విహరిస్తున్నారు.

**విహంగ వీక్షణం**

సర్కారు హెలికాప్టర్ జాయ్ రైడ్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఒక రైడ్ సుమారు 7 నిమిషాల పాటు నిర్వహిస్తున్నారు. విహంగ వీక్షణం చేస్తూ గోదావరి పరివాహక ప్రాంతం చూస్తూ ఆనందపడుతున్నారు. ఒక్కొక్కరు రూ.4500 చెల్లిస్తున్నారు.

**పిండ ప్రదానాలు**

తమ కుటుంబాల్లో చనిపోయిన వంశ వృక్షం పేరున పుష్కర సమయంలో పిండ ప్రదానాలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మంగళగిరికి చెందిన కుంచం తాండవ వెంకటేశ్వరరావు తమ కుటుంబంలో మృతి చెందిన 33 మంది, సోమవరపు గంగాధరరావు 28మంది పేరున పిండ ప్రదానాలు చేయించారు.

**ఆదియోగి శివుడు**

తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో ప్రతిష్ఠించిన ఆదియోగి శివుడిని విగ్రహం మాదిరిగా నది ఒడ్డున శివుడు, నంది విగ్రహం ఏర్పాటు చేశారు. భక్తులందరూ అక్కడికి వచ్చి దర్శించుకుంటున్నారు.

**జ్ఞాన సరస్వతిని స్మరిస్తూ**

నది ఒడ్డున ఏర్పాటు చేసిన 17 అడుగుల జ్ఞాన సరస్వతీ మాత, రెండు వైపులా కొలువుదీరిన చతుర్వేద మూర్తులను దర్శించుకుంటున్నారు. పిల్లలు తమకు చదువు బాగా వచ్చేలా జ్ఞానాన్ని అందించాలని కోరుతూ.. గుర్తుగా ఫొటోలు తీసుకుంటున్నారు.

**గొప్ప క్షేత్రం.. కాళేశ్వరం**

పవిత్రమైన త్రివేణి సంగమ క్షేత్రం కాళేశ్వరంలో సరస్వతి నదీ పుష్కర స్నానాలు చేసి తరించాలని నటకిరీటి రాజేంద్రప్రసాద్ భక్తులను కోరారు. ఆయన పుణ్యస్నానం చేశాక కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.

**హైకోర్టు న్యాయమూర్తి పూజలు**

కాళేశ్వర క్షేత్రంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె పుష్కర పుణ్యస్నానం ఆచరించేందుకు ఆదివారం కాళేశ్వరం వచ్చారు. ఆమెకు కలెక్టరు రాహుల్‌శర్మతోపాటు, రాజగోపురం వద్ద అర్చకులు మర్యాద పూర్వక స్వాగతం పలికారు.

**పుష్పగిరి పీఠాధిపతి రాక**

పుష్కరాల నాలుగో రోజున పుష్పగిరి పీఠాధిపతి శ్రీఅభినవోద్దండ విద్యాశంకర భారతి స్వామి పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించారు. ఆలయంలో స్వామి వారికి జలాభిషేకాలు నిర్వహించారు.

# ఇలా చేద్దాం.. ప్రమాదాలు నివారిద్దాం

హైదరాబాద్: నివాస భవనాల్లో అగ్ని ప్రమాదాలు నగరవాసులను బెంబేలెత్తిస్తున్నాయి. 18 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాల్లో అగ్నిప్రమాద నివారణ చర్యలు తప్పనిసరి చేసిన నేపథ్యంలో అంతకంటే తక్కువ ఎత్తున్న భవనాల్లో భద్రతా ప్రమాణాలు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రమాదాల సమయంలో సహాయక చర్యల్లో ఇబ్బందులతో పాటు మరణాలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిపుణులు సూచిస్తున్నారు.

ప్రతి ఇంట్లో ఫైర్ స్మోక్ డిటెక్టర్ ఏర్పాటు చేసుకోవాలి.

అగ్నిప్రమాదం జరిగినప్పుడు అందరినీ అప్రమత్తం చేసే హారన్ స్విచ్ బోర్డులు ప్రతి అంతస్తులో ఉండాలి.

ప్రతి అంతస్తులో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు ఏర్పాటు చేసుకోవాలి.

ప్రధానంగా మీటర్ల దగ్గర, ఎలక్ట్రిక్ ఉపకరణాల వద్ద ఫైర్ బాల్స్ ఉండాలి.

ప్రతి అంతస్తు వద్ద ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేసుకోవాలి.

మంటల్లో చిక్కుకుంటే ఇంట్లో దుప్పట్లను నీటిలో తడిపి ఒంటికి చుట్టుకొని అక్కడి నుంచి బయటపడే ప్రయత్నం చేయొచ్చు.

మంటలు అంటుకున్నప్పుడు విలువైన వస్తువుల కోసం చూడకుండా మొదట ప్రాణాలు కాపాడుకోవాలి. ఒక వేళ పొగలో చిక్కుకుంటే కంగారుపడొద్దు. పొగ గది పైభాగంలో ఎక్కువగా, కింది భాగంలో తక్కువగా ఉంటుంది. ముఖానికి తడి రుమాలుతో గానీ టవల్‌ను చుట్టుకోవాలి. నెమ్మదిగా శ్వాస పీలుస్తూ నేలపై పాకుతూ అక్కడి నుంచి బయటపడే ప్రయత్నం చేయాలి.



# తోడుకునోళ్లకు 'లెక్క'లేనంత

పెద్దపల్లి: మట్టి.. ఇసుక.. సహజ వనరులు ఏవైనా తరలింపునకు అనుమతించే క్రమంలో ఓ లెక్క ఉంటుంది. పరిమాణాన్ని బట్టి ప్రభుత్వానికి రుసుం చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో చెరువు మట్టి విషయంలో ఈ నిబంధనను విస్మరించారు. ఏకంగా ట్రిప్పుల చొప్పున లెక్కలు వేసి అనుమతులిచ్చేశారు. దీంతో 'తోడుకున్నోడికి తోడుకున్నంత' అన్న చందాన దోపిడీ సాగుతోంది.

**ఎందుకీ వెసులుబాటు!** జిల్లాలో అనుమతించిన పరిమాణం కంటే ఎక్కువ ట్రిప్పులు తీసుకెళ్లడం.. వివాదం కోర్టుల వరకు వెళ్లడం.. ఆ తర్వాత తరలించిన మట్టికి కొలతలు వేసి, జరిమానా విధించడం పరిపాటిగా మారింది. గతేడాది కొత్తపల్లి చెరువు నుంచి అనుమతించిన దాని కంటే ఎక్కువ తరలించారు. చివరికి జరిమానా చెల్లించే పరిస్థితి రాగా రాజకీయ పార్టీల జోక్యం పెరగడంతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ట్రిప్పునకు రూ.2700గా ధర నిర్ణయించారు.

**ఎన్నెన్నో సందేహాలు**

'ట్రిప్పు' అంటే ఎంత పరిమాణం అనేది ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. టిప్పర్ సామర్థ్యం ఎంత? అందులో ఎంతవరకు అనుమతిస్తారన్నది పరిగణనలోకి తీసుకోలేదు. 10 టైర్ల టిప్పర్‌లో 20 టన్నులు, 12 టైర్ల టిప్పర్‌లో 25 టన్నుల వరకు మట్టిని తరలించే అవకాశముంటుంది. చెరువులో మట్టిని ఎంత లోతు వరకు తవ్వొచ్చనే నిబంధన లేదు. నీటిపారుదల శాఖ నిబంధనల ప్రకారం చెరువులో సాధారణంగా మీటరు కంటే ఎక్కువ లోతు తవ్వడానికి అనుమతి ఉండదు. భారీ యంత్రాలతో అధిక లోతులో తవ్వుతున్నారు. ఓదెల మండలం కొలనూరు అప్పమయ్య చెరువులో 2-3 మీటర్ల మేర తవ్వుతున్నారు. చెరువు వద్ద లస్కర్ మినహా సాంకేతిక పరిజ్ఞానం కలిగిన అధికారులు పర్యవేక్షించడం లేదు. సదరు లస్కర్ కూడా ట్రిప్పుల సంఖ్య రాసుకునే రెవెన్యూ అధికారి వద్దే కాలక్షేపం చేస్తున్నాడు.

వాహనాల్లో సామర్థ్యానికి మించి మట్టి తరలింపుతో గ్రామీణ రహదారులు దెబ్బతింటున్నాయి. తూకం వేసేందుకు ఇసుక మాదిరిగా



చెరువుల వద్ద వేబ్రిడ్జిలు ఏర్పాటు చేయలేదు. రవాణా శాఖ అధికారులు కూడా అటువైపు కన్నెత్తి చూడటం లేదు. సుల్తానాబాద్-శ్రీరాంపూర్ రోడ్డు పక్కనే ఉన్న కొలనూరు చెరువు మట్టిని సుల్తానాబాద్, పెద్దపల్లి మీదుగా ఇటుక బట్టీలకు తరలించుకునే అవకాశముండగా మడిపల్లి కాలనీ, అంకంపల్లి, మూలసాల క్రాస్‌రోడ్డు, ఉప్పరపల్లి, కొత్తపల్లి, పెద్దబొంకూర్‌ల మీదుగా తరలిస్తున్నారు.

**ప్రశ్నించిన వారిపై కేసులు**

జిల్లాలోని 33 చెరువుల నుంచి మట్టి రవాణాకు అధికారులు అనుమతించగా ప్రస్తుతం 10 చెరువుల నుంచి తరలిస్తున్నారు. మట్టి తరలింపుపై ప్రశ్నించిన వారిని బెదిరించడం, కేసులు పెట్టడం పరిపాటిగా మారింది.


**విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం**

కొలనూరు అప్పమయ్య చెరువులో అనుమతించిన మేరకే మట్టిని తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, చెరువులో నీరు ఊరేటంత లోతులో మట్టి తీస్తే విచారణ జరిపి, చర్యలు తీసుకుంటాం.
ప్రసాద్, నీటిపారుదల శాఖ ఈఈ, సుల్తానాబాద్

# పెట్రోలు బంకుల్లో సదుపాయాలేవీ..!

సిరిసిల్ల : కేంద్ర పెట్రోలియం మంత్రిత్వశాఖ నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు ఉచితంగా వివిధ సౌకర్యాలు కల్పించాలి. కాగా క్షేత్ర స్థాయిలో ఇవి ఎక్కడా అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి బంకులో ఇంధనం నాణ్యతను పరీక్షించే పరికరాలు అందుబాటులో ఉండాలి. రక్షిత తాగునీరు, శౌచాలయాలు, అత్యవసర సమయంలో ఫోన్ చేసుకునే సదుపాయం మొదలైనవి కల్పించాలి. వాహనాల టైర్లలో ఉచితంగా గాలి నింపాలి. జిల్లా వ్యాప్తంగా 85 పెట్రోలు బంకులు ఉండగా చాలాచోట్ల సదుపాయాలు కనిపించడం లేదు. చాలా బంకుల్లో గాలి నింపే యంత్రాలు పని చేయకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. గత్యంతరం లేకపోవడంతో వాహనదారులు డబ్బులు చెల్లించి వాహనాల్లో గాలి నింపించుకుంటున్నారు. మండు వేసవిలో తాగునీటి సదుపాయం కల్పించాల్సి ఉండగా అవేమీ కనిపించడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

**అధికారులు పర్యవేక్షిస్తే మేలు**



బంకుల్లో సేవా లోపం ఉంటే ఫిర్యాదు చేసేందుకు తప్పని సరిగా రిజిస్టర్లు అందుబాటులో ఉండాలి. అదనపు కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు దృష్టి సారించి ఇంధనం నాణ్యత పరీక్షిస్తూ ఉండాలి. అగ్నిమాపక పరికరాలు(ఫైర్ సేఫ్టీ) సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తెలుసుకోవాలి. వినియోగదారులకు అందాల్సిన కనీస సౌకర్యాలను పర్యవేక్షించాలి. కాగా క్షేత్రస్థాయిలో అధికారులు తనిఖీలు నిర్వహించడం లేదన్న విమర్శలున్నాయి.

**నోటీసులు జారీ చేస్తాం**

జిల్లావ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. నిబంధనలు పాటించకుంటే నోటీసులు జారీ చేస్తాం. వినియోగదారులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటాం. వసంతలక్ష్మి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

# ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా కారును నడిపింది ఒక మహిళే.. ఆమె ఎవరంటే ?

ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా కారును నడిపింది ఒక మహిళే అన్న విషయం మీకు తెలుసా? ఇది నిజం! కార్ల ఆవిష్కర్త కార్ల్ బెంజ్ రూపొందించిన తొలి కారును 1888 ఆగస్టు 5న ఆయన భార్య బెర్తా బెంజ్ నడిపారు. ఈ ప్రయాణం కేవలం ఒక సాహసం మాత్రమే కాదు.. ఆటోమొబైల్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. కార్ల్ బెంజ్ తాను తయారుచేసిన కారు పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తుంటే.. బెర్తా బెంజ్ మాత్రం ఆ కారుపై పూర్తి నమ్మకంతో ఉన్నారు. తన భర్త నిద్రపోతున్నప్పుడు తన కుమారులు రిచర్డ్, యూజెన్‌లతో కలిసి బెర్తా బెంజ్ సీక్రెట్ గా ఈ ప్రయాణాన్ని ప్రారంభించారు. వారు ఏకంగా 106 కిలోమీటర్లు కారు నడిపారు. జర్మనీలోని మాన్‌హైమ్ నుంచి ఫోర్జ్‌హైమ్ వరకు సాగిన ఈ ప్రయాణంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. ఈ ప్రయాణంలో కారులో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఇంధనం అయిపోతే వారు స్థానిక అపోథికరీ (మందుల దుకాణం) నుంచి 'లిగ్రోయిన్' అనే రసాయనాన్ని కొనుగోలు చేసి ఇంధనంగా వాడారు. బ్రేకులు పాడైతే, బెర్తా తన జుట్టులో ఉన్న పిన్‌ను ఉపయోగించి వాటిని రిపేరు



చేశారు. కొండలు ఎక్కడానికి కారుకు శక్తి సరిపోకపోతే, ఆమె తన కుమారులను కిందకు దిగి కారును తోయమని చెప్పేవారు. ఈ సంఘటనలన్నీ కారు రూపకల్పనలో ఉన్న లోపాలను కార్ల్ బెంజ్‌కు తెలియజేయడానికి సాయపడ్డాయి. ఈ ప్రయాణం తర్వాత కార్ల్ బెంజ్ తన కారులో ముఖ్యమైన మార్పులు చేశారు. బెర్తా బెంజ్ సాహసోపేతమైన ప్రయాణం ప్రజల్లో కారు పట్ల ఆసక్తిని, నమ్మకాన్ని పెంచింది. కారు కేవలం ఒక ఆవిష్కరణ మాత్రమే కాదు. అది నిజంగా పనిచేస్తుందని, సాధారణ ప్రజలు కూడా దానిని ఉపయోగించవచ్చని ఆమె నిరూపించారు. అందుకే 'ఎక్కువ దూరం కారు నడిపిన మొదటి వ్యక్తి' గానే కాకుండా, ఆటోమొబైల్ పరిశ్రమకు ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా బెర్తా బెంజ్ చరిత్రలో నిలిచిపోయారు. ఆమె ధైర్యం, దూరదృష్టి లేకుండా కార్ల్ బెంజ్ ఆవిష్కరణకు అంతర్జాతీయ గుర్తింపు రావడానికి చాలా సమయం పట్టేది.

# అమెరికా 'గోల్డెన్ డోమ్' క్షిపణి రక్షణ ప్రాజెక్టు కథేంటి?




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం $175 బిలియన్ల భారీ వ్యయంతో 'గోల్డెన్ డోమ్' క్షిపణి రక్షణ ప్రాజెక్టును ప్రకటించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు నాయకత్వం వహించడానికి అమెరికా స్పేస్ ఫోర్స్ జనరల్ మైకేల్ గెట్లిన్‌ను నియమించారు. ఈ ప్రాజెక్టును "మాన్హాటన్ ప్రాజెక్టు స్థాయిలో" విస్తృతంగా అభివృద్ధి చేయనున్నట్లు ట్రంప్ వెల్లడించారు. ఓవల్ ఆఫీసులో జరిగిన ఈ ప్రకటనలో అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌తో పాటు జనరల్ గెట్లిన్ కూడా ఉన్నారు. ట్రంప్ మాట్లాడుతూ ఈ గోల్డెన్ డోమ్ వ్యవస్థ మూడు సంవత్సరాల్లో పూర్తవుతుందని, అమెరికా ఖండంలోని మొత్తం ప్రాంతాన్ని ం కెనడాను కూడా కలుపుకొని వైమానిక ముప్పుల నుంచి రక్షించగలదని తెలిపారు. "ఇది అమెరికాకు ఒక గొప్ప రోజు," అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ప్రకటన సమయంలో ఆయన వెనుక అమెరికా ఖండాన్ని బంగారు రంగులో చూపిస్తూ, క్షిపణులను అడ్డుకుంటున్న దృశ్యాలతో కూడిన ఒక పోస్టర్ ఉంచారు. ఈ గోల్డెన్ డోమ్ ప్రణాళిక అంతరిక్ష ఆధారిత శాటిలైట్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ప్రపంచంలో ఎక్కడి నుంచైనా, అంతరిక్షం నుంచైనా వచ్చే క్షిపణులను గుర్తించి అడ్డగించగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇది అమెరికాలో ఇప్పటికే ఉన్న రక్షణ వ్యవస్థలతో సమన్వయంగా పని చేస్తుందని ట్రంప్ చెప్పారు.

**ఇజ్రాయెల్ 'ఐరన్ డోమ్' నుండి 'గోల్డెన్ డోమ్' దిశగా..** ప్రారంభంలో 'అమెరికా కోసం ఐరన్ డోమ్'గా ప్రకటించిన ఈ ప్రాజెక్టును, తరువాత ఫిబ్రవరిలో పెంటగాన్ 'గోల్డెన్ డోమ్'గా పేరు మార్చింది. దీనికి కారణం ఇజ్రాయెల్ యొక్క 'ఐరన్ డోమ్' బ్రాండ్‌పై ఉన్న ట్రేడ్‌మార్క్ హక్కులు కావచ్చని విశ్లేషకులు అంటున్నారు.

**–ధరపై చర్చ, సాంకేతిక సందేహాలు...** ఈ ప్రాజెక్టు ఖర్చు $175 బిలియన్లు అని ట్రంప్ చెప్పినప్పటికీ, గతంలో అమెరికా కాంగ్రెస్ బడ్జెట్ కార్యాలయం దీని వ్యయం 20 ఏళ్ల కాలంలో $161 బిలియన్ల నుండి $542 బిలియన్ల వరకు అయ్యే అవకాశం ఉందని తెలిపింది. 2012లో జాతీయ పరిశోధనా మండలి చేసిన అధ్యయనం ప్రకారం ఇది పూర్తిగా అమలవుతే ఖర్చు $831 బిలియన్ల (2025 విలువల ప్రకారం) దాటే అవకాశం ఉంది. మొంటానా రాష్ట్ర రిపబ్లికన్ సెనేటర్ టిమ్ షీహీ మాట్లాడుతూ, ఇది పూర్తిగా అమలైతే ట్రిలియన్ల ఖర్చు అయ్యే అవకాశం ఉందని చెప్పారు.

**– సాంకేతిక నిపుణుల ఆందోళనలు....** ఇజ్రాయెల్‌లో వినియోగంలో ఉన్న 'ఐరన్ డోమ్' చిన్న పరిమాణంలో, తక్కువ శ్రేణి క్షిపణులను అడ్డుకునే విధంగా ఉంది. కానీ అమెరికా భూభాగం దాదాపు 400 రెట్లు పెద్దది కావడంతో, అలాంటి వ్యవస్థను అమెరికాలో అన్వయించడంలో సాంకేతిక పరంగా చాలా సవాళ్లు ఉన్నాయని రక్షణ నిపుణులు పేర్కొంటున్నారు.

**– ప్రధాన కాంట్రాక్టర్లు – వ్యతిరేకతలు...** స్పేస్ ఎక్స్ (ఎలన్ మస్క్), పాలంటిర్, ఆండ్రిల్, వంటి ప్రముఖ సంస్థలు శాటిలైట్ ఆధారిత భాగాలను తయారుచేయడానికి పోటీపడుతున్నాయి. అయితే అంతరిక్షాన్ని ఆయుధాలుగా మారుస్తే అంతర్జాతీయ ఒప్పందాలపై ప్రభావం చూపుతుందని, కొత్త ఆయుధ పోటీకి దారి తీస్తుందని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. యూనియన్ ఆఫ్ కన్సర్డ్ సైంటిస్ట్ సంస్థ డైరెక్టర్ లారా గ్రెగో మాట్లాడుతూ "ఇది ఒక కల్పిత కల" అని వ్యాఖ్యానించారు. గతంలో చేసిన అంతరిక్ష క్షిపణి రక్షణ ప్రణాళికలు ఖరీదుతో పాటు సాంకేతికంగా కష్టమైనవని, సులభంగా ఎదుర్కొనేలా ప్రత్యర్థులు వ్యూహాలు రూపొందించగలరని తెలిపారు. గోల్డెన్ డోమ్ ప్రాజెక్టు అమెరికా రక్షణ రంగంలో పెద్ద అడుగుగా కనిపిస్తున్నప్పటికీ, దీని విజయాన్ని నిర్ధారించే అంశాలు సవాళ్లతో కూడి ఉన్నాయి. దీని వ్య యం, సాంకేతికత, అంతర్జాతీయ చట్టాలు అన్నీ గణనీయంగా పరిశీలించాల్సినవే. ఇది ఒక దౌత్య ప్రయోగంగా మారుతుందా, లేక భవిష్యత్తులో వ్యర్థ పెట్టుబడిగా మిగులుతుందా అన్నది కాలమే నిర్ణయించాలి.

# ఒళ్లు గగుర్పొడిచే కథ.. 50కి పైగా దారుణమైన హత్యలు చేసి, ఆ శవాలను మొసళ్లకు వేసిన సైకో కిల్లర్

మనిషి రూపాన్ని మార్చుకున్న ఓ క్రూర మృగం, దేవేందర్ (67) అనే సైకో కిల్లర్ కథ దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో 50కి పైగా దారుణమైన హత్యలు చేసి, ఆ శవాలను మొసళ్లకు ఆహారంగా వేయడం ఇతడికి ఒక వికృతమైన అలవాటు. సుదీర్ఘకాలంగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న ఈ సీరియల్ కిల్లర్‌ను రాజస్థాన్‌లోని దౌసా ప్రాంతంలో సాధువు వేషంలో జీవిస్తుండగా ఢిల్లీ పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. ఈ వార్తతో ఆయా రాష్ట్రాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.

**ఎవరీ ఈ దేవేందర్?...** దేవేందర్ అనే వ్యక్తిని ఢిల్లీ పోలీసులు గత ఏడేళ్లుగా గాలిస్తున్నారు. ఇతడు కేవలం హత్యలు చేయడమే కాదు, తన క్రూరత్వానికి ఒక వికృతమైన పరాకాష్టను చేరాడు. తాను హత్య చేసిన వ్యక్తుల మృతదేహాలను, ముఖ్యంగా చిన్న పిల్లలు, మహిళల మృతదేహాలను చంబల్ నదిలోని మొసళ్లకు ఆహారంగా వేసేవాడు. పోలీసుల విచారణలో ఈ విషయం బయటపడటంతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మానవత్వం లేని ఈ చర్యలు దేవేందర్ ఎంతటి సైకో అనేది స్పష్టం చేస్తున్నాయి.

**హత్యల వెనుక అసలు కథ...** దేవేందర్ మొట్టమొదటిసారి 1990లలో నేర ప్రపంచంలోకి అడుగుపెట్టాడు. చిన్నచిన్న దొంగతనాలతో ప్రారంభించి, క్రమంగా హత్యలు చేయడం అలవాటు చేసుకున్నాడు. ఇతని నేర చరిత్రలో ఎక్కువగా లారీ డ్రైవర్లు, వ్యాపారులు, ఒంటరి ప్రయాణికులు బాధితులుగా ఉన్నారు. ముఖ్యంగా లారీ డ్రైవర్లను హత్య చేసి, వారి లారీల్లోని సరుకును అమ్ముకోవడం ఇతనికి అలవాటు. ఇలా హత్యలు చేసిన తర్వాత, ఆధారాలు దొరకకుండా ఉండేందుకు మృతదేహాలను చంబల్ నదిలో మొసళ్లకు వేసేవాడు. చంబల్ నది మొసళ్లకు ప్రసిద్ధి చెందిన ప్రాంతం కావడంతో, ఈ క్రూరమైన చర్యకు దేవేందర్ దానిని వేదికగా చేసుకున్నాడు. ఇతని నేరాల్లో అనేక మంది మహిళలు, పిల్లలు కూడా బాధితులుగా ఉన్నారు.

**పోలీసులకు సవాల్....** దేవేందర్‌ను గతంలో పోలీసులు అనేకసార్లు అరెస్ట్ చేశారు. ఇతనిపై దేశంలోని వివిధ కోర్టులు, జీవిత ఖైదుతో పాటు, మరణ శిక్ష కూడా విధించాయి. అయితే, పోలీసుల కళ్లు గప్పి ఇతడు పలు మార్లు తప్పించుకున్నాడు. చివరిసారిగా 2018లో జైలు నుంచి బయటకు వచ్చి మళ్ళీ తప్పించుకున్నాడు. అప్పటి నుంచి ఢిల్లీ పోలీసులు ఇతడిని పట్టుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇతడు ఎంతటి ప్రమాదకారి అనే విషయం తెలుసు కాబట్టే, పోలీసులు ఇతడిని పట్టుకోవడాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.

**సాధువు వేషంలో పట్టుబడిన సైకో...** ఢిల్లీ పోలీసులు ఎట్టకేలకు దేవేందర్ ఉన్న స్థావరాన్ని గుర్తించారు. రాజస్థాన్‌లోని దౌసా ప్రాంతంలో ఒక సాధువులా వేషం మార్చుకుని, తన గుర్తింపును దాచిపెట్టి జీవిస్తున్న ఇతడిని అరెస్ట్ చేశారు. ఇతడు ఎంతో కాలంగా తప్పించుకు తిరుగుతున్న సీరియల్ కిల్లర్ కావడంతో, ఇతడి అరెస్ట్ వార్త ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాల ప్రజల్లో పెద్ద ఎత్తున ఊరట నింపింది. ఇతడి అరెస్ట్‌తో ఆయా రాష్ట్రాల పోలీసులు కూడా భద్రతపై ఊపిరి పీల్చుకుంటున్నారు.

ప్రస్తుతం దేవేందర్‌ను ఢిల్లీకి తరలించి విచారిస్తున్నారు. ఇతడు చేసిన నేరాలు, వాటి వెనుక ఉన్న ఉద్దేశాలు, ఇతనికి ఇంకా ఎవరైనా సహకరించారా అనే విషయాలపై పోలీసులు కూపీ లాగుతున్నారు. ఇతని అరెస్ట్‌తో కొన్ని దశాబ్దాల పాటు పెండింగ్‌లో ఉన్న అనేక హత్య కేసులకు ఒక ముగింపు దొరికే అవకాశం ఉంది.

సినిమా 'షో'

# ఆ ముగ్గురు భామలకు డిమాండ్!







హీరోయిన్లు ఎంతో మంది వస్తుంటారు. వెళ్తుంటారు. కానీ కొందరు మాత్రమే ఫేమస్ అవుతుంటారు చేసింది ఒక్క సినిమా అయినా ఓ వైబ్ క్రియేట్ చేస్తుంటారు. ఈ మధ్య కాలంలో అలాంటి వైబ్ తెచ్చింది ఎవరంటే? కయాదు లోహర్, ఇవానా, మమతా బైజ్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. డ్రాగన్ సినిమా తో కయాదు లోహర్ ఏ రేంజ్ లో ఫేమస్ అయిందో తెలిసిందే. అమ్మడు హాట్ అప్పిరియన్స్ తోనే రీచ్ అయిపోయింది. తమిళ అనువాద చిత్రంతోనే తెలుగులో ఫ్యాన్స్ ని సంపాదించుకుంది. అటుపై సోషల్ మీడియా లో మరింత ఫేమస్ అయింది. ప్రస్తుతం ఈ బ్యూటీ తమిళ్ లోనే మూడు సినిమాలు చేస్తోంది. తెలుగులోనూ అవకాశాలు వస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ లో ఓ సినిమాకి అగ్రిమెంట్ చేసుకున్నట్లు సమాచారం. ఇంకా నవతరం దర్శకులు అమ్మడికి కథలు వినిపిస్తున్నారు. అమ్మడికి ఉన్న యువ క్రేజ్ ని దృష్టిలో పెట్టుకుని ఛాన్సలిస్తున్నారు. కేరళ కుట్టి ఇవానా కయాదు కంటే ముందే కోలీవుడ్ లో ఫేమస్ అయింది. లవ్ స్టోరీ సినిమాతో తెలుగు ఆడియన్స్ కు బాగా రీచ్ అయింది. డ్రాగన్ లో క్లైమాక్స్ ఎంట్రీలోనూ అదరగొట్టింది. ఇవానా రాకతో థియేటర్లు దద్దరిల్లాయి. దీంతో అమ్మడు టాలీవుడ్ కి ఏ రేంజ్ లో కనెక్ట్ అయిందో అర్దమైంది. ప్రస్తుతం తెలుగు సినిమాల్లో కూడా అవకాశాలు అందుకుంటుంది. ఇటీవలే రిలీజ్ అయిన సింగిల్ లో లీడ్ రోల్ పోషించి అలరించింది. ఈ సినిమా మంచి విజయం సాధించడంతో మరోసారి అమ్మడి పేరు హైలైట్ అవుతుంది. అమ్మడి ట్యాలెంట్ కి మరిన్ని తెలుగు సినిమా ఛాన్సులు ఖాయం. ప్రేమలు చిత్రంతో ఇలాగే సంచలనం మైంది మమతా బైజు. ప్రస్తుతం కోలీవుడ్ లో బిజీగా ఉంది. తెలుగులోనూ అవకాశాలు వస్తున్నాయి. కానీ సరైన కథలైతే తప్ప కమిట్ అవ్వనంటోంది. వీళ్లంతా ఒకే ఒక్క సినిమాతో ఫేమస్ అయిన బ్యూటీలే.

# కేన్స్ గుట్టు మట్లు విప్పిన ఫ్యాషనిస్టా ఉర్ఫీ


బోల్డ్ సెలక్షన్‌తో ఫ్యాషన్ సరిహద్దులు చెరిపేసిన బ్యూటీ ఉర్ఫీ జావేద్. ఈ భామ కేన్స్ 2025 ఫెస్టివల్ లో సందడి చేసేందుకు చాలా ప్లాన్ చేసినా, వీసా తిరస్కరణ కారణంగా హాజరు కాలేకపోయింది. ఈ సందర్భంగా ఉర్ఫీ ఏమాత్రం నిరశ చెందక మరో అవకాశం కోసం ప్రయత్నిస్తానని పాజిటివ్ గా స్పందించింది. అయితే కేన్స్ లో పాల్గొనడం అంటే అదేదో నెత్తిపై కుంపటి పెట్టుకున్నట్టు కాదని, టికెట్లు కొనుక్కుని ఎవరైనా వెళ్లొచ్చని చెప్పింది. ఈ వేదికలకు వెళ్లడానికి అర్హత అవసరం లేదని, స్పానర్ చేసేవాళు ఉంటే చాలని ఉర్ఫీ జావేద్ చెప్పింది. కేన్స్ 2025 ఉత్సవాలకు వెళ్లేందుకు తనకు స్పాన్సర్ చేసేవాళ్లు ఉన్నా కానీ, వీసా రిజెక్షన్ నిరాశపరిచిందని తెలిపింది. కేన్స్ రెడ్ కార్పెట్ పై ప్రభావశీరులు, ఇతర సెలబ్రిటీలు హాజరు కావడానికి స్పాన్సర్ షిప్ ఉంటుందని, విమానం టికెట్లు సహా వసతుల ఏర్పాటు వగైరా అన్నీ వాళ్లే చూసుకుంటారని కూడా ఉర్ఫీ జావేద్ వెల్లడించింది. ఉర్ఫీ ఇన్



స్టాలో ఇలా సందేశం ఇచ్చింది. "కేన్స్‌కు వెళ్లడం అనేది మీ యోగ్యతపై ఆధారపడి లేని అవకాశం. బ్రాండ్‌లు రెడ్ కార్పెట్‌కు టిక్కెట్లు కొనుగోలు చేసి, ప్రచారం కల్పించే లేదా ప్రభావితం చేసేవారికి, సెలబ్రిటీలకు ఇస్తారు. సాధారణ వ్యక్తులు కూడా టిక్కెట్లు కొనుగోలు చేయవచ్చు. కేన్స్ రెడ్ కార్పెట్‌పై నడవడం ఒక విజయం కాదు.. నాకు కూడా వర్తించదు. ఇది మిమ్మల్ని మీరు ప్రమోట్ చేసుకునే అవకాశం. అదే నిజం. నేను నిజం చెబుతున్నాను" అని ఉర్ఫీ రాసింది. మీ సినిమా ఫెస్టివల్ లో ప్రీమియర్ అయితే అది ఒక విజయం. డబ్బు ఉంటే, స్పాన్సర్ ఉంటే ఎవరైనా దీనిని సాధ్యం చేయగలరు.. అని చెప్పింది. కేన్స్ కి వెళ్లడానికి ఇండీ వైల్డ్ తనకు స్పాన్సర్ చేసిందని, కానీ నా వీసా తిరస్కరించరించారని ఉర్ఫీ బాధను వ్యక్తం చేసింది. తిరస్కరణలు ముగింపు కాదని, మరింత కష్టపడి పనిచేయడానికి ఒక ప్రోత్సాహకం అని తాను నమ్ముతున్నానని ఉర్ఫీ తెలిపింది. బెపన్నా, మేరీ దుర్గా సహా పలు టెలివిజన్ షోలలో కనిపించిన ఉర్ఫీ, రియాలిటీ షో బిగ్ బాస్ %ుు% 1లో పాల్గొన్న తర్వాత బాగా పాపులరైంది. 2024లో లవ్ సెక్స్ ఔర్ ధోఖా 2 చిత్రంలో నటించింది. గత సంవత్సరం అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రదర్శించిన రియాలిటీ సిరీస్ 'ఫాలో కర్ లో యార్'లో కూడా కనిపించింది.

# బుట్టబొమ్మ క్యాలరీలు కరిగించే కళ

ప్రతి సినిమాకి మార్పు అవసరం. ఆర్టిస్ట్ లుక్ మారాలి. పాత్రకు తగ్గట్టు శరీరాకృతిని మలుచుకోవాలి. దాని కోసం తిండి కట్టేయాలి. తినే పదార్థాలు మారాలి. ఇలాంటి ప్రయోగాలు కథానాయికలకు కొత్తేమీ కాదు. ముఖ్యంగా వరుస సినిమాలతో క్షణం తీరిక లేనంత బిజీగా ఉన్న పూజా హెగ్డే నిరంతరం తన డైట్ చార్ట్ మార్చేస్తుంది. తన పాత్రకు తగ్గట్టు శరీరాకృతిని తీర్చిదిద్దుకుంటుంది. రెట్రో కోసం కొంత బొద్దెక్కిన ఈ బ్యూటీ ఇప్పుడు అనూహ్యంగా డైట్ మార్చేసింది. తాజాగా తన రోజువారీ తిండి వ్యాయామ షెడ్యూల్ ని రివీల్ చేసింది. నేలపై పడుకుని కేలరీలు బర్న్ చేస్తూ.. బ్రెడ్ – నూడుల్స్ తినడం వగైరా వగైరా విషయాలను షేర్ చేసింది. ఫిట్ నెస్ కోసం తపించడంలో పూజా తగ్గేదేలే! అని నిరూపిస్తోంది. ఇది సినిమా కోసం కాదు.. మంచి




రూపం కోసం ప్రయత్నం. శరీరం నుంచి అవసరం లేని ఫ్యాట్ ని తొలగించి తిరిగి తన పాత రూపానికి మారేందుకు పూజా ఇలా కఠిన వ్యాయామం చేస్తోంది.

పూజా ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీబిజీగా ఉంది. తదుపరి వరుణ్ ధావన్ – మృణాల్ ఠాకూర్‌తో కలిసి ఒక హిందీ సినిమా చేస్తోంది. కాంచన 4, జన నాయగన్, కూలీ చిత్రాలలోను నటిస్తోంది. టాలీవుడ్ లోను కంబ్యాక్ కోసం ప్రయత్నిస్తోంది. ప్రస్తుతానికి తమిళంపై ఆధారపడిన ఈ బ్యూటీ హిందీలోను పెద్ద అవకాశాల కోసం వెయిట్ చేస్తోంది.

Printed,Published and owned by CHALLA MADHUSUDHANA RAO,and Printed at VEERENDRA GRAPHICSD.NO.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001. Guntur Dist, A.P. and Published at D.No.8-25-33, NTR Nagar, 2nd Line, Guntur - 522001, Guntur Dist, A.P. **R.N.I. No. APTEL/2013/48712** Editor : CHALLA MADHUSUDHANA RAO